



# విజయభాను





విశాఖపట్నం, గురువారం 02-11-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 48 సంచిక : 46 పేజీలు : 08 వెల : 1 రూపాయి

## ఏపీ ప్రజలది అసాధారణమైన ప్రతిభ

: ప్రధాని మోదీ

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం సోషల్ మీడియాలో ట్వీట్ చేశారాయన. ఏపీ ప్రజలు చైతన్య వంతులంటూ ట్వీట్ చేశారాయన. అంతేకాదు అసాధారణమైన ప్రతిభ, అచంచలమైన సంకల్పం, దృఢమైన పట్టుదల ఇక్కడి ప్రజల సొంతమంటూ ప్రధాని తన సందేశంలో కొనియాడారు. ఏపీ ప్రజల శ్రేయస్సు కోసం, విజయం కోసం నిరంతరం తాను ప్రార్థిస్తానంటూ ప్రధాని మోదీ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభసందర్భంగా, ఈ చైతన్యవంతమైన రాష్ట్ర ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. వారి అసాధారణమైన ప్రతిభ, అచంచలమైన సంకల్పం మరియు దృఢమైన పట్టుదలతో, ఆంధ్రప్రదేశ్ ప్రజలు విభిన్న రంగాలలో తమదైన ముద్ర వేశారు.

## నేడు విశాఖకు సీఎం జగన్



విశాఖపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విశాఖ వస్తున్నారు. ఉదయం 7.35 గంటలకు సీఎం నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి బయలు దేరుతారు. 8.50 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో 9.15 గంటలకు మధురవాడ ఐటీ హిల్‌కు చేరుకుంటారు. 9.20 గంటలకు రోడ్డు మార్గం ద్వారా రుషికొండ రాడిసన్ బ్లూ రిసార్ట్‌కు బయలుదేరుతారు. 9.30 గంటల నుంచి తరువాయి 2లో..

## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో సీఎం జగన్



అమరావతి, **(విజయభాను న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతురణ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి.. అనంతరం జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఆపై తెలుగు తల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం ఏ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే వైఎస్సార్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం కోసం వెళ్లారు.

ఇదిలా ఉంటే.. రాష్ట్ర ఉత్సవంగా అవతరణ వేడుకలు ఏపీ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఉదయం నుంచే అన్ని జిల్లా కేంద్రాల్లో జరిగే కార్యక్రమాల్లో కలెక్టర్లు, ఎస్పీలు పాల్గొం టున్నారు. తెలుగు సంస్కృతి ప్రతిబిం బించేలా సాంస్కృతిక కార్యక్రమాలు జరుగను న్నాయి. మరోవైపు ఢిల్లీలోని ఏపీ భవన్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహి స్తున్నారు.



### కొన్ని దశాబ్దాలుగా చేయలేని పనులు..

## గత 9 ఏళ్లలో చేశాం

: ప్రధాని మోదీ



దిల్లీ: కొన్ని దశాబ్దాలుగా చేయలేని ఎన్నో పనులను భారత్ – బంగ్లాదేశ్‌లు గత 9 ఏళ్లలో చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇరు దేశాల మధ్య సహకారం కొత్త శిఖరాలకు చేరుకుందని తెలిపారు. భారత్ సహకారంతో బంగ్లాదేశ్‌లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోదీ బుధవారం బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో కలిసి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారత్ – బంగ్లాదేశ్‌ల మధ్య సహకారం విజయవంతమైంది. కొన్ని దశాబ్దాలుగా చేయలేని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను గత 9 ఏళ్లలో ఇరు దేశాలు కలిసి చేశాయి. ఇది ఎంతో సంతోషించదగిన విషయం" అని ప్రధాని అన్నారు. భారత్ సహకారంతో బంగ్లాదేశ్ పూర్తి చేసిన అభివృద్ధి కార్యక్రమాల్లో అఖౌరా – అగర్తలా క్రాస్ బోర్డర్ రైలు లింక్, ఖుల్నా – మొంగ్లా పోర్ట్ రైలు లైన్, మైత్రి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. అఖౌరా – అగర్తలా క్రాస్ బోర్డర్ రైలు లింక్ ప్రాజెక్ట్ పొడవు 12.24 కి.మీ. భారత్‌లో 6.78 కి.మీ, బంగ్లాదేశ్‌లో 5.46 కి.మీ మేర దీని నిర్మాణం జరిగింది. భారత ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 392.52 కోట్లు ఖర్చు చేసింది. ఖుల్నా – మొంగ్లా పోర్ట్ రైలు లైన్ ప్రాజెక్ట్ వ్యయం 388.92 మిలియన్ డాలర్లు . ఈ ప్రాజెక్ట్ ద్వారా ఖుల్నా రైల్వే నెట్‌వర్క్‌ను బంగ్లాదేశ్‌లో రెండో తరువాయి 2లో..


## దండిగా జీఎస్టీ వసూళ్లు..

### అక్టోబర్‌లో 1.72లక్షల కోట్లు..!

దిల్లీ: వస్తువుల సేవల పన్ను భారీగా వసూలయ్యాయి. అక్టోబర్ నెలలో రూ.1.72లక్షల కోట్లు వచ్చాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. 2022 అక్టోబర్‌లో రూ.1.52లక్షల కోట్లు వసూలవగా.. ఈ ఏడాది 13శాతం పెరిగాయి. జీఎస్టీ వసూళ్లు అత్యధికంగా రావడం ఇది రెండోసారి. 2024 ఆర్థిక సంవత్సరం మొదటి అర్థభాగంలో జీఎస్టీ వసూళ్లు 11శాతం పెరిగి.. రూ.9.92లక్షల కోట్లకు చేరుకుంటున్నట్లు ఆర్థికశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నెలవారీ సగటు వసూళ్లు రూ.1.66 లక్షల కోట్లకు చేరగా.. అక్టోబర్ 2023లో జీఎస్టీ ద్వారా మొత్తం రూ.1,72,003 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సీజీఎస్టీ రూ.30,062 కోట్లు, ఎస్‌జీఎస్టీ కింద రూ.38,171 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.91,315కోట్లు వసూలయ్యాయి. అలాగే, వస్తువుల దిగుమతిపై ఐజీఎస్టీలో రూ.42,127 కోట్లు వసూలయ్యాయి.

మొత్తం వసూళ్లు అత్యధికంగా రూ.1.8 లక్షల కోట్ల మార్కును దాటగా.. జీఎస్టీ వసూళ్లలో తొలిస్థానంలో గుజరాత్, రెండోస్థానంలో కర్నాటక నిలిచాయి.

## చంద్రబాబు మధ్యంతర బెయిల్, సీఐడీ అనుబంధ పిటిషన్‌పై 3న తీర్పు



అమరావతి, **(విజయభాను న్యూస్) :** టిడిపి అధినేత చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ నేపథ్యంలో మరిన్ని షరతులు విధించాలని కోరుతూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం నవంబరు 3న తీర్పు వెలువరించనున్నట్టు తెలిపింది."కోర్టు ఆదేశాలను ఎక్కడా అతిక్రమించలేదు. చంద్రబాబు మాట్లాడటం అనేది ఆయన ప్రాథమిక హక్కులలో భాగమే తప్ప అతిక్రమణ కాదు. జైలు శిక్ష పడిన వారికి కూడా మీడియాతో మాట్లాడే అవకాశం గతంలో కోర్టులు కల్పించాయి. సీఐడీ చెబుతున్న షరతులు ఆయన హక్కులు హరించే విధంగా ఉన్నాయి. కేసు దర్యాప్తుపై ఎటువంటి ప్రభావం చూపుతుందో సీఐడీ అధికారులు చెప్పలేక పోతున్నారు" అని చంద్రబాబు తరఫు న్యాయవాదులు వాదించారు.జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత చంద్రబాబు మీడియాతో మాట్లాడారంటూ వీడియో క్లిప్పింగ్స్‌ను సీఐడీ తరఫు న్యాయవాది కోర్టుకు అందజేశారు. కోర్టు ఆర్డర్ ఉన్న తర్వాత కూడా మీడియాతో మాట్లాడారని ధర్మాసనం దఅష్టికి తెచ్చారు. ర్యాలీలు నిర్వహించ వద్దని కోర్టు ఆదేశాలు ఉన్నా...రాజమహేంద్రవరం నుంచి 13 గంటల పాటు ర్యాలీగా విజయవాడకు వచ్చారని కోర్టుకు తెలిపారు.

### చంద్రబాబుకి ప్రజల మద్దతు చూసి..

## జగన్ వణికిపోతున్నారు



అమరావతి, **(విజయభాను న్యూస్) :** తెలుగుదేశం అధినేత చంద్రబాబుకి మద్దతు తెలిపేందుకు వచ్చిన జనసందోహాన్ని చూసి సీఎం జగన్ సహా వైకాపా నేతలు వణికిపోతున్నారని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నారు. చంద్రబాబుకి మద్దతుగా ప్రజలు ర్యాలీ చేస్తే వైకాపా నేతలకు ఇబ్బందేంటని ప్రశ్నించారు. ఈ భూమ్మీద తానే అపర మేధావి అన్నట్టు సజ్జల రామకృష్ణారెడ్డి ఫీలవుతున్నారని దుయ్యబట్టారు. కోర్టు నిబంధనలున్నా చంద్రబాబుకు మద్దతు తెలిపేందుకు వేలాది మంది తరువాయి 2లో..






## ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు





విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగ నిరతి మరువలేనిదని జిల్లా కలెక్టర్ డా.ఏ.మల్లిఖార్జున కొనియాడారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సమావేశ మందిరంలో జ్యోతి ప్రజ్వలన గావించి అమరజీవి పొట్టి శ్రీరాములు, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించిన మహాపురుషుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావాలని 58 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి దేశంలోనే తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా సాధించిన మహానుభావుడని అన్నారు. భావితరాల వారికి స్వేఛ్చాయుత, ప్రశాంత జీవనం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగి అహర్నిశలు శ్రమించి ప్రాణత్యాగం చేసిన మహనీయునికి నిండు మనసుతో నివాళులు అర్పిస్తున్నట్లు చెప్పారు. అటువంటి మహనీయుని గుర్తుచేసుకొని వారి స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తదుపరి పలు కారణాలతో 2014 జూన్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణ రాష్ట్రం విడిపోయిందని తెలిపారు. నూతన రాష్ట్రంలో ఎన్నోరకాల మార్పులు, సంస్కరణలు చోటు చేసుకోగా, 26 జిల్లాలతో తరువాయి 2లో..

# దుర్గాదేవి దయ వల్లనే ప్రపంచ సాధికారత

## – కస్టమ్స్ చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్



విశాఖ పట్నం: విశాఖపట్నం కస్టమ్స్ గ్రూప్ “సి” ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా విశాఖ పోర్టు దరి కస్టమ్స్ ఆఫీస్ ఆవరణలో శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ చేసి తొమ్మిది రోజులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహా అన్నసమరాధన కార్యక్రమం కస్టమ్స్ ఆఫీస్ ఆవరణలో జరిగింది. అలాగే సాయంత్రం శ్రీశ్రీశ్రీ దుర్గాదేవి హారతి పూజ అనంతరం అమ్మవారి నిమజ్జన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కస్టమ్స్ – జీ ఎస్ టి చీఫ్ కమిషనర్ సంజయ్ పంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఏటా ఇక్కడ అధికారుల సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రులు జరుగుతాయి అన్నారు. ఉద్యోగుల్లో దైవభక్తి పెంపొందించడానికి ఈ ఉత్సవాలు ఎంత గానో దోహదం చేస్తాయి అన్నారు. కస్టమ్స్ ప్రిన్సిపాల్ కమిషనర్ ఎన్. శ్రీధర్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఇక్కడ దుర్గా దేవి పూజలు ఘనంగా జరిగాయి అన్నారు. దుర్గా దేవి ఆశీస్సులుతో ప్రపంచ సాధికారత సాధ్యపడుతుంది అన్నారు. జీ ఎస్ టి కమిషనర్ రుషి గోయల్ , అడిషనల్ కమిషనర్ ప్రదమేష్ మాట్లాడుతూ, ఏటా ఇక్కడ దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి అని చెప్పారు. ప్రజలకు అమ్మ వారి దీవెనలు వుండాలి అని కోరారు. డిప్యూటీ కమిషనర్ ఎం. రవిశంకర్ , మాట్లాడుతూ, ఇరవై ఏళ్ల క్రితం సముద్రంలో జరిగిన ఘటనలతో 25 మంది ఉద్యోగులు చనిపోయారు అని విచారం వ్యక్తం చేశారు. దీంతో సిపాయి తేజ దుర్గాదేవి పూజలు ప్రారంభించాడు అని గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రమాదాలు ఆగిపోయాయి అన్నారు. కమిషనర్ శ్రీరామ్ మాట్లాడుతూ, ఉత్సవాలు ఘనంగా జరిగాయి అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో , సంస్థ ఉన్నతాధికారులు, ఉద్యోగులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కస్టమ్స్ గ్రూప్ “సి” ఆఫీసర్స్ అసోసియేషన్ విశాఖపట్నం అధ్యక్షుడు ఎస్. విశ్వనాధం , ప్రధాన కార్యదర్శి లకే చిట్టిబాబు , మాట్లాడుతూ, పోర్టు, డి ఎల్ బి, పోలీసు శాఖ సహకారంతో విధులు నిర్వహిస్తున్నాము అన్నారు. ఏటా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడు వేల మందికి అన్నదానం చేస్తున్నాము అన్నారు. సంఘం జాయింట్ సెక్రటరీ కే. చార్లెస్ , కోశాధికారి పి. దుర్గారాజు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అధికారులు అన్నదానం ప్రారంభించారు.

# ప్రజారక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలి




అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రజారక్షణభేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్. రాము, మండల నాయకులు కే. సోమునాయుడు అన్నారు . బుధవారం దోసూరు , అచ్యుతాపురం గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ నవంబర్ 15న ప్రజారక్షణ బేరి పేరుతో విజయవాడలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు . నవంబర్ 2న ప్రారంభమయ్యే బస్సు యాత్ర నవంబర్ 5 న అచ్యుతాపురంలో పర్యటిస్తుందని ఈ బస్సు యాత్రను కార్మికులు , ప్రజలు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు . విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ అమ్మడానికి ప్రయత్నిస్తున్నది, కోట్లాదిమంది కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్ లను తెచ్చింది, 15 సంవత్సరాల క్రితం ఉన్న కనీస వేతనంలో జీవోలు ఇప్పటికీ అమలు చేస్తున్నారు దీనివలన కార్మికులు మరింత శ్రమదోపిడి గురవుతున్నారు వంట గ్యాస్, పెట్రోలు ,డీజిల్ నిత్యవసర వస్తువులు, కరెంటు, వంటి ధరలు పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై తీవ్రభారాలను వేస్తున్నారు .

కార్మికులు నుండి వసూలు చేసిన 1100 కోట్ల రూపాయలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేయాలని , సంక్షేమ బోర్డు పునరుద్ధరించి క్లైమ్లు పరిష్కరించాలని , కార్మికుల కనీస వేతనాలు 26,000 నెలకు ఇవ్వాలని , స్కీం వర్కర్లు అందర్నీ పర్మినెంట్ చేయాలని జరుగుతున్న బస్సు యాత్రకి ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు .

ఈ కార్యక్రమంలో రమేష్ ,రాజు , అప్పలనాయుడు , పైడిరాజు , రాజునాయుడు , ప్రసాదు , అన్నంరాజు తదితరులు పాల్గొన్నారు .

# అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

## – సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాధం

విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన కరువు మండలాల్లో జిల్లాను విస్మరించడాన్ని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాధం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండిరచారు. జిల్లాలో 24 మండలాకు గాను 18 మండలాల్లో తీవ్రమైన కరువు పరిస్థితులు ఉంటే ఒక్క మండలాన్ని కూడా కరువు మండలంగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. కరువు మండలాల ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కొలబద్దలు ఏమిటో ప్రకటించకుండా కరువు మండలాలుగా ప్రకటించడం గర్హనీయమని, ప్రభుత్వం అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. జిల్లాలో జూన్ 1 నుంచి అక్టోబర్ 31వరకు 895.9 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 634.4 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోద్కెంది. సగటు వర్షపాతంలో –29శాతం లోటు వుంది. ఒక్క అక్టోబర్ మాసంలోనే 214.1మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి వున్నప్పటికీ కేవలం 30.8మిల్లీ మీటర్ల మేర మాత్రమే వర్షం కురిసింది. జిల్లాలో 23 మండలాల్లో 75%కి పైగా వర్షపాతం లోటు వుంది. పొట్ట దశలో వర్షాలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్న దుస్థితి నెలకొంది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2,04,985 ఎకరాల్లో వివిధ పంటలు సాగు కావాల్సి ఉండగా.. కేవలం 1,35,095 (66%) ఎకరాల్లో మాత్రమే పంటలు సాగు నమోద్కెంది. ఈ మొత్తం విస్తీర్ణంలో వరి 1,36,460 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా.. 1,10,765 ఎకరాల్లో (81%) మాత్రమే నమోద్కెంది. వీటిలో 722 ఎకరాల్లో పంట ఎండిపోయినట్లు, దాదాపు 5వేల ఎకరాల్లో పంట వాడిపోయినట్లు వ్యవసాయ శాఖ అధికారులే గుర్తించారు. అంతేకాకుండా నానాపాట్లు పడి ఆలస్యంగాన్కెనా వరినాట్లు వేసినా గానీ.. వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండటంతో ఆ పంట దిగుబడి గణనీయంగా పడిపోతుందని చెబుతున్నారు. ఉదాహరణకు నక్కపల్లి మండలంలో 5,125 ఎకరాల్లో వరిసాగు కావాల్సి ఉండగా.. కేవలం 1,212 ఎకరాల్లో మాత్రమే రైతులు వరినాట్లు వేశారు.

# విద్యార్థులకు చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి అభినందనలు



పరవాడ:–గోవాలో ప్రతిష్టాత్మకగా జరుగుతున్న 37వ ఎడిషన్ ఇండియన్ ఒలింపిక్స్‌గా పిలిచే ‘నేషనల్ గేమ్స్’ జాతీయ క్రీడలలో పెంటథ్లాన్ ( స్విమ్మింగ్ రన్నింగ్ షూటింగ్) ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సంస్కృతి గ్లోబల్

విద్యార్థులు స్మృతి రాణి ప్రాధాన్ శిఫా పాతిమా లకు బుధవారం నాడు పాఠశాల చైర్మన్ పి.సూర్యనారాయణరెడ్డి అభినందనలు తెలిపారు. జాతీయ క్రీడాలలో రాష్టం కు పతకంను అందించిన పెంటథ్లాన్ ఆంధ్రప్రదేశ్ జట్టు లో మీరు సభ్యులు కావడం విశేషమని భవిష్యత్తు లో మీరు కూడా పతకాలు సాధిచాలని అందుకు తగ్గ ప్రణాళిక కు ముందుగానే తయారుచేసుకోవాలని సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్య తో పాటు బహుముఖ ప్రతిభను వెలికి తీయుటకు వివిధ రంగాలలో నిష్ణుతులైన గురువులతో విద్యను అందిస్తున్నము అని మరియు క్రీడలలో అయితే 15 రకాలు అయినటువంటి క్రీడాంశాలలో నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ స్పోర్ట్స్ నందు గుర్తింపు పొందిన, జాతీయ స్థాయి కోచ్ లతో తర్ఫిదు ఇవ్వడం జరుగుతుంది అని అటువంటి శిక్షణను చక్కగా ఉపయోగించు కోవాలని కోరారు.

మరియు ఈ క్రీడలలో మీరు పాల్గొంటాం వలన పొందిన ధ్రువపత్రం భవిష్యత్తు లో ఉద్యోగం మరియు ఉన్నతవిద్యాలో ప్రవేశ సమయం లో క్రీడాకారులకోట లో ఉపయోగ పడతాయి అని చెప్పారు ,మీ స్ఫూర్తి తో ఆడపిల్లలు క్రీడాలలో పాల్గొని విజయాలు సాదించాలని సంస్కృతి గ్లోబల్ చైర్మన్ పి.సూర్యనారాయణ రెడ్డి ఆకాంక్షించారు.మరియు వీరిని ప్రిన్సిపాల్ ఎన్. సీతలక్ష్మి సీఈఓ కె. నిశంత్ కోఆర్డినేటర్ రామలక్ష్మి, స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు అభినందనలు తెలిపారు. కార్యక్రమం లో కోచ్ లు హరినాథ్ రెడ్డి, మనీష్, బషీర్, రాజేష్ పాల్గొన్నారు.



# నేడు విశాఖకు సీఎం జగన్

11 గంటల వరకు 25వ ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీలో (ఐసీఐడీ) పాల్గొంటారు. 11.05 గంటలకు రాడిసన్ బ్లూ రిసార్ట్ నుంచి బయలు దేరి మధురవాడ హెలిపాడ్‌కు చేరుకుంటారు. 11.35 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. 11.45 గంటలకు విమానంలో తిరుగు పయనమవుతారు.

## కొన్ని దశాబ్దాలుగా చేయలేని పనులు.. గత 9 ఏళ్లలో చేశాం

అతిపెద్ద ఓడరేవు మొంగ్లా వరకు పొడిగించారు.

దీని పొడవు 65 కి.మీ. ఇక మైత్రి సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా బంగ్లాదేశ్‌లోని ఖుల్నా డివిజన్‌లో ఉన్న రామ్‌పాల్ వద్ద 1320 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవర్‌ప్లాంట్‌ను నిర్మించారు. ఈ ప్రాజెక్ట్‌ను బంగ్లాదేశ్–ఇండియా ఫ్రెండ్‌షిప్ పవర్ కంపెనీ లిమిటెడ్ (BIFPCL) చేపట్టింది.

# ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

పునర్వ్యవస్థీకరణ జరిగిందని, అందులో భాగంగా జిల్లాకు ఉజ్వల భవిష్యత్తు ఉందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తొలుత విద్యార్థులు మా తెలుగు తల్లికి.. మల్లెపూదండ గీతాన్ని ఆలపించారు. శాసనమండలి సభ్యులు పి.రవీంద్రబాబు అందరికీ రాష్ట్ర అవతరణ శుభాకాంక్షలు తెలిపారు. 1956 సం.లో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు మరో ఆరు రాష్ట్రాలు కూడా విభజించబడ్డాయని గుర్తుచేశారు. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసులో ప్రత్యేక భాషా ప్రయుక్త రాష్ట్రం కావాలని ఎంతోమంది ప్రాణత్యాగం చేసారని, వారిలో ప్రముఖులు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని, వారి ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక రాష్ట్రం సాధించేందుకు 58 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ప్రాణత్యాగానికి పూనుకున్న ఏకైక వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన రాష్ట్ర సాధనకే కాకుండా క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం వంటి వాటిలో కూడా పాల్గొన్న సంగతిని ఆమె గుర్తుచేసారు. అటువంటి మహానుభావులను స్మరించుకుంటూ, వారి త్యాగాలుగా గుర్తుగా నెల్లూరు జిల్లాకు నెల్లూరు పొట్టిశ్రీరాములు జిల్లాగా రాష్ట్ర ముఖ్యమంత్రి నామకరణం చేసారని చెప్పారు. సంయుక్త కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్ష వలన తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, ఆయన త్యాగాలను మరువలేనివన్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుదామన్నారు. డిసిసిబి ఛైర్మన్ కోలా గురువులు మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలను చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో నగరాల కార్పొరేషన్ ఛైర్ పర్సన్ పిల్లా సుజాత, ఐసిడిఎస్ ప్రాంతీయ ఛైర్ పర్సన్ మంతెన మాధవి, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఫుడ్ కమీషన్ మెంబర్ బి.కాంతారావు, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్, జిల్లా అధికారులు, అధిక సంఖ్యలో ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకి ప్రజల మద్దతు చూసి..

# జగన్ వణికిపోతున్నారు

జనం వచ్చారని.. నిబంధనలు లేకుంటే అంతకు నాలుగు రెట్లు జనం వచ్చేవారని తెలిపారు. లోకేశ్ ఢిల్లీ వెళ్తే అధికార పార్టీ నేతలు గల్లీల్లో పెడబొబ్బలు పెడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు బెయిల్‌పై బయటకొస్తే వైకాపా నేతలు వణికిపోతున్నారన్నారు. స్కిల్ కేసులో ఒక్క ఆధారం సేకరించలేకపోయారని, ఇప్పుడు మద్యంలో అక్రమాలంటూ చంద్రబాబుపై మరో అక్రమ కేసు పెట్టారని ధ్వజమెత్తారు. ప్రజా బలం ఉన్న నాయకుడు చంద్రబాబు అని స్పష్టం చేశారు. మరో ఐదు నెలల తర్వాత వైకాపా నేతల్ని ప్రజలు రాష్ట్రం నుంచి తరిమికొట్టడం ఖాయమని హెచ్చరించారు.

# రహదారి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

## ముఖ్య కూడళ్లపై దృష్టి సారించాలి

### రహదారి భద్రత కమిటీ నిర్ణయాలపై సత్వర చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున



విశాఖపట్నం, నవంబర్ 01 : జిల్లాలోని రద్దీ ప్రాంతాలను గుర్తించి ప్రమాద నివారణ చర్యలను చేపట్టడం ద్వారా రహదారి ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లిఖార్జున అధికారులకు సూచించారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై సంబంధిత ప్రభుత్వ శాఖలు సత్వరమే చర్యలు చేపట్టాలన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, సూచనలపై తీసుకున్న చర్యలపై ఆరా తీసిన ఆయన ఇప్పటివరకు చేపట్టిన, చేపడుతున్న పనులపై నివేదికను తెలియజేయాలన్నారు. మిగిలి ఉన్న పనులను సత్వరమే పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని రద్దీ ప్రాంతాల్లో గల కమర్షియల్ కాంప్లెక్సులలో సెల్లార్ పార్కింగ్ తప్పనిసరిగా ఉండాలని, లేనిచో కఠిన చర్యలు తీసుకోవాలని జివియంసి అధికారులను ఆదేశించారు. దీనివలన రహదారులపై కార్లు, బైకులు నిలుపుదల చేయకుండా నిరోదించవచ్చని సూచించారు. రహదారి భద్రతా కమిటీ చేపట్టిన చర్యలతో గతంలో కంటే ప్రస్తుతం రహదారి ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టిందన్నారు.

నగరంలోని పలు రద్దీ కూడళ్ల వద్ద గల రహదారులను మరింత వెడల్పు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని, ఆ పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తిచేయాలని జివియంసి అధికారులకు తెలిపారు. మద్యం సేవించి , హెల్మెట్ లేకుండా, సీట్ బెల్ట్ లేకుండా,సెల్ ఫోన్ వినియోగిస్తూ ఆయా వాహనాలను నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కూడా ముమ్మరంగా చేపట్టాలన్నారు.ప్రముఖ రద్దీ ప్రదేశాలైన ఆశీలమెట్ట, మద్దిలపాలెం, బీచ్ రోడ్, హనుమంతవాక జంక్షన్, కార్ షెడ్, బిర్లా జంక్షన్, బాజీ జంక్షన్, కంచరపాలెం మెట్టు, శ్రీహరిపురం, కూర్మన్నపాలెం జంక్షన్ల వద్ద గల సర్వీస్ రోడ్లను వెడల్పు చేసి రద్దీని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గాజువాక ప్రాంతంలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ శాఖలకు అప్పగించిన పనులను బాధ్యతగా వ్యవహరించి సకాలంలో పూర్తిచేయాలని చెప్పారు. జిల్లాలో జాతీయ రహదారిపై పూర్తికావలసిన ఫ్లైఓవర్ బ్రిడ్జిలను సకాలంలో పూర్తిచేయాలని ఎన్.హెచ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జివియంసి కమీషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ మాట్లాడుతూ జిల్లా రోడ్డు భద్రాతా కమిటీ సమావేశంలో నిర్దేశించిన అంశాలను పరిగణలోకి తీసుకొని చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నగరంలో మేజర్ రోడ్లు మరియు రోడ్ల వెడల్పు వంటివి ఫేజ్ క్రింద 32.79 కి.మీ మేర రహదారి పనులను చేపట్టడం జరిగిందని అవి పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. అలాగే జాతీయ రహదారి 16 నుండి రేవళ్లపాలెం గ్రామానికి 80 అడుగుల రహదారి, రేవళ్లపాలెం నుండి నవోదయ స్కూల్ వరకు 100 అడుగుల రహదారి విస్తరణ పనులు, అలాగే జాతీయ రహదారి నుండి కొమ్మాది గ్రామానికి 100 అడుగుల రహదారి విస్తరణ పనులు, జాతీయ రహదారి–5 నుండి దువ్వాడ రైల్వేస్టేషను వరకు గల రహదారి పనులను జి.వి.యం.సి చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే అన్ని కూడళ్ల వద్ద బస్ బేలను ఏర్పాటుచేసామని, బ్యూటిఫికేషన్ పనులను కూడా చేపడుతున్నామని కలెక్టరుకు వివరించారు.

జాతీయ రహదారులు , జిల్లా రహదారులు ప్రక్కన ఉన్న రోడ్లను తనిఖీ చేసి ఆక్రమణలను వెంటనే తొలగించాలని , జాయింట్ ఇన్స్పెక్షన్ లో గుర్తించిన లోపాలకు సంబంధించిన పనులను వెంటనే పూర్తి చేయాలని తెలియజేశారు.. ఉప రవాణా కమీషనర్ ఆర్.సిహెచ్.శ్రీనివాసరావు గత సమావేశం నుండి ఇప్పటివరకు చేసిన పనులని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు .

ఈ సమావేశంలో ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజినీర్ కె.కాంతిమతి, జి.వి.ఎం.సి పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణ,సిటీ ప్లానర్ కె.ఎం.దొర,పంచాయతీ రాజ్ ,ఏపిఇపిడిసిఎల్, వైద్య ఆరోగ్య శాఖ,ఎన్.హెచ్, పోలీస్,ఆర్.టి.సి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విజయ సాయిరెడ్డివి బ్లాక్ మెయిల్ వ్యాఖ్యలు

## – ఎం పి(రాజ్యసభ) జీ.వీ.ఎల్ నరసింహా రావు



ద్వారకానగర్ (విజయభాను న్యూస్) : వైసీపీ రాజ్య సభ సభ్యుడు విజయ సాయి రెడ్డి వ్యాఖ్యలు బ్లాక్ మెయిల్ వ్యాఖ్యలు మాదిరిగా వున్నాయి అని బీజేపీ రాజ్య సభ సభ్యుడు జీ వీ ఎల్ నరసింహా రావు పేర్కొన్నారు. ఆశీల మెట్ట గాంధీ పార్కు వద్ద బీజేపీ మహిళా మోర్చ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు మద్యం విధానం పై చేసిన ఆరోపణలకు వైసీపీ సరైన సమాధానం చెప్పలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం అవివేకం అన్నారు. జాతీయ పార్టీ మహిళా నేత పై ఇష్టానుసారం వ్యాఖ్యలు చేయడం సరికాదు అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ, విజయ సాయి రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మద్యం వ్యాపారంలో 30 లక్షల కోట్ల మేరకు అవినీతి జరుగుతుంది అన్నారు. దీనిపై సీబీఐ విచారణకు వైసీపీ డిమాండ్ చేయాలి అని సూచించారు. ఎన్నికల తరువాత వైసీపీ నేతలు జైలుకి వెళతారు అని జోస్యం చెప్పారు. మహిళా మోర్చ ఉత్తరాంధ్ర జోనల్ ఇంఛార్జి కట్టా పద్మ, జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాత, ఎస్ సి మోర్చ నేత మాధవి లత చార్లెస్ మాట్లాడుతూ, పురంధేశ్వరి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎం.పి.విజయ సాయి రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు అని విచారం వ్యక్తం చేశారు. అనంతరం వారు విజయ సాయి రెడ్డి చిత్ర పటానికి మద్యంతో అభిషేకం చేసి, చెప్పులతో కొట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి విశాఖ అధ్యక్షుడు మేడ పాటి రవీంద్ర , నాయకులు దానేశ్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలింగ్ ద్వారానే మానసిక సమస్యలకు విముక్తి



సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** పోటీ ప్రపంచంలో విద్యార్జనలో, వృత్తిలో ఎదురయ్యే వత్తిడులను తట్టుకుని నిలవాలంటే కౌన్సిలింగ్ ద్వారానే సాధ్యమని ముఖ్యంగా మానసిక ఆరోగ్యంతో ముందుకు సాగడానికి ఇతర మార్గాల కంటే నిపుణుల కౌన్సిలింగ్ తప్పనిసరి అని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ అప్లైడ్ సైకాలజీ విభాగంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో నిపుణులు సూచించారు. గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు ముఖ్యఅతిధిగా హజరై ప్రసంగిస్తూ యువతరం తమ చూట్టూ ఉన్న వివిధ ఆకర్షణల ప్రభావానికి లోనై విలువైన జీవితాన్ని నాశనం చేసుకోకూడదన్నారు. టీనేజ్‌లో ఉండే యువత మొబైల్ ఫోన్ వినియోగంలో, దురలవాట్లుకు దూరంగా ఉండటంలో వ్యక్తిగత క్రమశిక్షణ పాటించాలన్నారు. దుర్వసనాలకు ఒకసారి బానిసగా మారితే మానసిక వత్తిడి పెరిగి నైపుణ్యాలు సన్నగిల్లుతాయని, జీవితంలో ఎదుగుదలకు అవి అవరోధంగా నిలుస్తాయన్నారు. గ్రీన్‌వేలీ ఫౌండేషన్ ఛైర్ పర్సన్ శ్రీమతి ఉమారాజు మాట్లాడుతూ దేశంలో సరిహద్దు ప్రాంతాల ద్వారా నార్కో టెర్రరిజం వ్యాప్తి చెందుతోందని, యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. దీనిపై పోరాటానికి కేంద్ర ప్రభుత్వం "నషాముక్త భారత అభియాన్" కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేస్తోందన్నారు. మద్యం సేవించడం జన్యుపరమైన సమస్యగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పోటీ ప్రపంచంలో కుటుంబ సభ్యుల నుంచి, సహ విద్యార్థుల నుంచి సహకారం అందక యువత దుర్వసనాల బారిన పడుతున్నారని, కౌన్సిలింగ్ ద్వారా 25 శాతం మంది తిరిగి సాధారణ జీవితం గడుపుతున్నారని తెలిపారు. హెచ్.ఐ.వి.పై పోరాడిన విధంగా మాదకద్రవ్యాల నుంచి విముక్తికి సమాజం వైపు నుంచి ప్రయత్నం జరగాలన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్‌ఛార్జి డీన్ ప్రొఫెసర్ బండి కామయ్య మాట్లాడుతూ ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులే మానసిక సమస్యలకు కారణమవుతున్నాయన్నారు. కుటుంభ వ్యవస్థ నాశనం కావడం, యువత పై పర్యవేక్షణ లేక పోవడం స్వభావంలో మార్పు తెస్తూ మానసికంగా ఒంటరి చేస్తున్నాయన్నారు. గిరిజన సమాజంలో కంటే పట్టణాలలో ఉండే నాగరిక సమాజంలోనే మానసిక సమస్యలు ఉన్నవారు అధికంగా ఉంటున్నారని అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యాలయాలలో వత్తిడుల నుంచి యువతను బయటకు తేవడానికి కౌన్సిలర్ల అవసరం ఉందన్నారు.

గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్ ప్రొఫెసర్ కె.చిన్నయ సూరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అప్లైడ్ సైకాలజీ విభాగం అధిపతి డాక్టర్ కె.సునీత తదితరులు పాల్గొన్నారు. మానసిక ఆరోగ్యంపై నెలరోజుల పాటు విద్యార్థులు చేపట్టిన కార్యక్రమాల వివరాలను వెల్లడించడంతో పాటు పోస్టర్ ప్రదర్శన, వీది నాటికలు, సంగీత, నృత్య ప్రదర్శనతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.



# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



విశాఖపట్నం, నవంబర్ 1 : నవంబర్ 2వ తేదీన జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఏ.మల్లిఖార్జున జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్ వర్మ లతో కలిసి పరిశీలించారు. ర్యాడిసన్ బ్లూ హొటల్ లో నిర్వహించనున్న 25వ కాంగ్రెస్ మరియు 74వ కార్యనిర్వాహక సమావేశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపధ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ ర్యాడిసన్ బ్లూ హొటల్ ని సందర్శించి, సమావేశ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో జరిగే సమావేశాలు దృష్ట్యా నిర్వహణ పరమైన లోటుపాట్లు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఇతర దేశాల నుండి మంత్రులు హాజరుకానున్నందున మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ పర్యటన కార్యక్రమంలో జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ ఉమేష్ కుమార్, భీమిలి రెవిన్యూ డివిజనల్ అధికారి భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. పి.జగదీశ్వరరావు, కేంద్ర జల వనరుల శాఖ సిబ్బంది , ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అదీప్ కు పెదముసిడి వాడ నాయకులు ఘన సత్కారం



పరవాడ : పరవాడ మండలం పెద ముష్టి వాడి పంచాయతీలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వమే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనఎమ్మెల్యే అదీప్ రాజుకు పల్లా నాగమణి కబాడీ అప్పారావు, ఉప సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి, సచివాలయం కన్వీనర్ అలమండ నారాయణరావు పెద ముష్టివాడ వైసిపి ఎంపీటీసీ అభ్యర్థి నందవరపు శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలవతో ఘనంగా సత్కరించారు... అనంతరం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.. సర్కార్ అందిస్తున్న ప్రభుత్వ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు.. ఈ కార్యక్రమంలో వైసీపీ సీఈసి సభ్యులు పైల శ్రీనివాసరావు జడ్పిటిసి పిఎస్ రాజు, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, ఎంపీడీవో హేమ సుందర్ రావు, వ్యవసాయ అధికారిని చంద్రావతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ, హౌసింగ్ ఏఈ రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ గండి రామారావు,వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కలవలపల్లి సత్యనారాయణ, ఎలమర్తి బుజ్జి లెజెండ్, వైసీపీ సీనియర్ నాయకులు ఒమ్మి అర్జున్, ఎం కిరణ్ చందు, బొబ్బర్ శీను తదితరులు పాల్గొన్నారు..

# ట్రైన్ ఆక్సిడెంట్ లో క్షత్తగాత్రులైన ముగ్గురు బాధితులకు రూ.12లక్షల చెక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే వాసుపల్లి

- పాక్షికంగా గాయపడిన క్షతగాత్రులకు నెల రోజులలోపు ట్రీట్మెంట్ జరిగితే రూ.2లక్షలు నష్టపరిహారం
- తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు నెల రోజులపైబడి ట్రీట్మెంట్ జరిగితే రూ.5లక్షలు నష్టపరిహారం



దొండపర్తి (విజయభాను న్యూస్) : రెండు రోజుల క్రితం విజయనగరం జిల్లా అలమండ - కంటకాపల్లి స్టేషన్స్ మధ్యలో జరిగిన రైల్వే ట్రైన్ ఆక్సిడెంట్ లో క్షతగాత్రులైన బాధితులను ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి స్వయంగా సంఘటన స్థలానికి వచ్చి క్షతగాత్రులైన బాధితులను పరామర్శించి చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, భరోసా ఇచ్చి తదుపరి సీఎం

ఆదేశాల మేరకు రైల్వే ట్రైన్ ఆక్సిడెంట్ లో క్షతగాత్రులైన బాధితులకు అనతికాలంలోనే బ్యాంకు చెక్స్ పంపిణీ చేసిన విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్.ఇందులో భాగంగా నేడు ముగ్గురు బాధితులకు

(1) రూ.5,00,000 లు నల్లా కుమారి,(30సం) కింగ్ జార్జ్ హాస్పిటల్ లో ట్రీట్మెంట్ జరుగుతుంది

గోడికొమ్ము గ్రామం, జామి మండలం, విజయనగరం జిల్లా.

2) రూ.5,00,000లు పి. శ్రీనివాస రావు (43సం) రైల్వే హాస్పిటల్ లో ట్రీట్మెంట్ జరుగుతుంది

రైల్వే క్వార్టర్స్, మర్రిపాలెం, విశాఖపట్నం జిల్లా

3) రూ.2,00,000/-లు బి. తెజేశ్వర రావు, 49సం" రైల్వే హాస్పిటల్ లో ట్రీట్మెంట్ జరుగుతుంది. సంతోష్ నగర్, గోపాలపట్నం విశాఖపట్నం జిల్లా.

మొత్తం 8మంది వైజాగ్ లో వివిధ హాస్పిటల్ లలో ట్రీట్మెంట్ జరుగగా మిగిలిన వారు విజయనగరం లో వివిధ హాస్పిటల్ లలో మెరుగైన వైద్యం అందుతుందని ప్రస్తుతానికి 15మంది చనిపోయారని ఎమ్మెల్యే తెలియజేశారు.ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే తో పాటు విశాఖపట్నం జిల్లా వైద్యాధికారి డా"జగదీశ్వర రావు, రెవిన్యూ సిబ్బంది చేతన్, కార్పొరేటర్లు కోడూరు అప్పలరత్నం, తోట పద్మావతి, మండల ప్రెసిడెంట్ పీతల వాసు, వార్డ్ ప్రెసిడెంట్స్ మాణిక్యాల రావు, సర్వేశ్వర రెడ్డి, మూలే రామిరెడ్డి,

స్టేట్ నాయకులు మాదబత్తుల రమేష్, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు పెంటపల్లి సత్యనారాయణ, సురపతి అప్పన్న, కోరాడ సురేష్, వేణుగోపాల్, బోణి దేవా, కృష్ణవేణి, దేవుడు లక్ష్మి, శ్రీనివాస్ రెడ్డి, కోటి, కనకల రాజు, సచివాలయం కన్వీనర్స్, గృహశారదులు తదితరులు పాల్గొన్నారు.

# పెదముసిడి వాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

## భారీ గజమాలతో ఎమ్మెల్యే అదీప్ కు స్వాగతం



పరవాడ :- పరవాడ మండలం పెద ముషడి వాడ పంచాయతీ నక్క వాణి పాలెం,పచ్చి కోరు వాణి పాలెం, గండివాన్నపాలెం, మార్కండేయ నగర్ తదితర గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వము ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు అన్నమరెడ్డి అదీప్ రాజ్ హాజరైనారు... ముందుగా గండివాన్నపాలెం విచ్చేసిన ఎమ్మెల్యే అదీప్ కు , వైసీపీ సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావుకు, పరవాడ జడ్పిటిసి అభ్యర్థి పి ఎస్ రాజుకు భారీ గజమాలతో సర్పంచ్ పల్లా నాగమణి కబడి అప్పారావు, వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి నందవరపు శ్రీనివాసరావు, వైస్ సర్పంచ్ అలమండ వెంకటలక్ష్మి నారాయణరావు తదితరులు ఘన స్వాగతం పలికారు.. ఈయనకు అడుగడుగునా బంతిపూలుతో స్థానిక ప్రజలు బ్రహ్మ రథం పట్టారు... గ్రామ అభివృద్ధి తమ ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు... సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటికి వెళ్లి అందుతున్నాయో లేవో అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి నందవరపు శ్రీనివాసరావు, సచఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, ఎంపీడీవో హేమ సుందర్ రావు, మండల వ్యవసాయ అధికారిని చంద్రావతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ షణ్ముఖ, హౌసింగ్ ఏఈ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, పంచాయతీరాజ్ ఏఈ గండి రామారావు,వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కలవలపల్లి సత్యనారాయణ, ఎలమర్తి బుజ్జి లెజెండ్, వైసీపీ సీనియర్ నాయకులు ఒమ్మి అర్జున్, ఎం కిరణ్ చందు, బొబ్బర్ శీను, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# అమర జీవిని ఆదర్శంగా తీసుకోవాలి

శ్రీకాకుళం,నవంబర్,1: అమరజీవి పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరెట్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం, పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అక్కడ నుంచి అధికారులతో కలసి పాత బస్టాండ్ కూడలికి చేరుకుని అక్కడ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయాలని పొట్టి శ్రీరాములు రెండు నెలల పాటు ఉపవాస ఉంటూ దీక్ష చేయగా కేంద్ర ప్రభుత్వం భాషా ప్రయుక్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించిందన్నారు. ఆయన చేసిన ప్రాణ త్యాగం వలన ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన త్యాగాన్ని స్మరించుకునే విధంగా నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరును పెట్టారని గుర్తు చేశారు. త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుదామన్నారు. ఆయన త్యాగాలను మరువలేనివని, ఆయన ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘువేంద్ర మీనా, డిఆర్ఓ ఎం గణపతి రావు, ఆర్డీఓ సి.హెచ్ రంగయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె చెన్నకేశవరవు, జిల్లా ఖజానా శాఖ అధికారి రవికుమార్, కలెక్టరెట్ ఏవో రాజేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేషు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విజయభాను సంపాదకీయం

### విరామం, ఊరట

తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబునాయుడుకు హైకోర్టులో లభించింది తాత్కాలికమయిన ఊరటే అయినా, పార్టీ శ్రేణులకు, శ్రేయోభిలాషులకు ఎంతో ఆనందం కలిగించింది. దేశదేశాలలో, వివిధ రాష్ట్రాలలోని చంద్రబాబు అభిమానులందరూ సంబరాలు చేసుకుంటున్నారు. ఇక, కుటుంబసభ్యుల సంగతి చెప్పనక్కరలేదు. యాభై రెండు రోజులుగా వారు అనుభవించిన వేదన సామాన్యమైనది కాదు. ఎప్పటికయినా ఈ యాతనకు ముగింపు ఉంటుందా అన్న నిస్పృహ ఒకవైపు, నిస్సహాయ స్థితిలోనే ప్రజలకు పరిస్థితులను నివేదించవలసిన కర్తవ్యం ఒకవైపు వారిని చాలా కష్టపెట్టి ఉంటుంది. వైద్య కారణాల మీద నాలుగువారాల పాటు లభించిన తాత్కాలిక బెయిల్ చంద్రబాబు కుటుంబానికి కొంత ఉపశమనాన్ని ఇస్తుంది. రాజమండ్రి కారాగారం వెలుపల, తనతోపాటు నిలచిన నాయకశ్రేణిని, స్వాగతం చెప్పడానికి వచ్చిన అభిమానులను ఆప్యాయంగా పలకరించడం ప్రజానాయకుడి సహజ సరళి. కుటుంబ సభ్యుల భావోద్వేగాల నడుమ, మనుమడు దేవాన్ష్‌ని చంద్రబాబు దగ్గరకు తీసుకున్న తీరు ఒక ఉద్విగ్న సన్నివేశం. బెయిల్‌తో పాటు, కొన్ని విధి నిషేధాలే లేకపోయివుంటే, రాజమండ్రి నుంచి అమరావతికి చంద్రబాబు రోడ్డు ప్రయాణం ఒక ఎడతెగని ఊరేగింపుగా జరిగి ఉండేది. రెండు తెలుగురాష్ట్రాలలోనూ వేడుకలు ఆర్భాటంగా జరిగేవి.

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో లభించిన ఈ ఊరట వల్ల, ఇతర కేసుల ఆధారంగా కూడా అరెస్టు చేయకుండా నాలుగు వారాల పాటు రక్షణ లభిస్తుంది. నేత్రచికిత్సతో పాటు, ఇతర ఆరోగ్యసమస్యలకు చంద్రబాబు ఈ విరామకాలంలో తాను ఎంచుకున్న అస్పత్రిలో చికిత్స తీసుకోవచ్చు. తాత్కాలిక బెయిల్ కాలంలో చంద్రబాబు రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడానికి ఆస్కారం ఉండదు. కానీ, తమ నాయకుడు బందిఖానా నుంచి వెలుపలికి రావడమే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, నాయకులకు కొండంత బలాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుంది. ఒకపక్క నాయకత్వం మీద కేసుల దాడి, మరో పక్క జనం దగ్గరకు వెళ్లడానికి జగన్ ప్రభుత్వం కల్పించే అవరోధాలు తెలుగుదేశం వారిని ఉక్కిరిబిక్కిరి చేసిన మాట నిజం. ఈ యాభై రెండు రోజుల కాలంలో ఒక్కొక్కసారి తెలంగాణ రాష్ట్రంలో కనిపించిన పోరాటం, ఆంధ్రప్రదేశ్‌లో కనిపించకపోవడానికి కారణం జగన్ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్బంధ, నిరంకుశ విధానాలే. తెలుగుదేశం పార్టీని రాజకీయంగా బలహీనపరచడానికే చంద్రబాబుమీద కేసులు బనాయించారని అనుకుంటున్నప్పుడు, ఇక రాజకీయ నిరసనలకు ప్రభుత్వం అవకాశం ఎందుకు ఇస్తుంది? చంద్రబాబుకు నిర్బంధం నుంచి దీర్ఘకాలిక విముక్తికి మంగళవారంనాటి బెయిల్ మొదటి మెట్టు అనుకుంటే, అది తెలుగుదేశం శ్రేణులకు కొత్త జవసత్వాలను అందిస్తుంది. నవంబర్ 10వ తారీకున విచారణకు వచ్చే పూర్తి బెయిల్ అభ్యర్థన చంద్రబాబుకు అనుకూలంగా వస్తుందన్న ఆశ ఆయన అభిమానగణంలో ఉన్నది. మధ్యంతర బెయిల్ ఆ ఆశకు ఊతం ఇచ్చింది కూడా.

కేసుల మంచిచెడ్డలు, అభియోగాలలోని సత్యాసత్యాలు ఇప్పుడు చర్చించనక్కరలేదు కానీ, చంద్రబాబు మీద కేసులన్నీ రాజకీయ కక్షతో మోపినవేనని జనం నమ్ముతున్నారు. కొన్నిసార్లు నేరవిచారణలు సాంకేతికమైనవిగానే మిగిలిపోతాయి. ప్రజల మనస్సుల్లో ఏర్పడిన గాఢమైన అభిప్రాయమే పై చేయిగా ఉంటుంది. తమ ముందున్న ప్రత్యామ్నాయ రాజకీయ పక్షం మీద కక్ష సాధింపు చేయడం ద్వారా లబ్ధిపొందేది జగన్ మాత్రమేనని జనం గ్రహించారు. ఆయన స్వభావం తెలిసినవారెవరైనా ఈ కార్పణ్యాన్ని గుర్తించగలరు. తన పాలన మీద ప్రజలలో పెరుగుతున్న విముఖతను, ప్రతిపక్షపార్టీ కార్యక్రమాలకు లభిస్తున్న ఆదరణను చూసిన తరువాతనే ఈ కేసులన్నీ ముందుకు వచ్చాయి. లేకపోతే, ఎన్నికలు తొందరలో పెట్టుకుని జగన్ ఈ దుస్సాహసానికి ఎందుకు పాల్పడతారు?

కేంద్రంలోనయినా, రాష్ట్రంలో అయినా అధికారంలో ఉన్నవారు, తమకు గిట్టనివారిని, ప్రత్యర్థులను వేధించడానికి అనైతికమైన, ద్వేషపూరితమైన పద్ధతులను అనుసరించడం తరచు చూస్తున్నాము. అందుకు చట్టాలే అనుమతిస్తున్నాయో, చట్టాలను అన్వయించడంలో న్యాయస్థానాలే పొరపాటు చేస్తున్నాయో తెలియదు కానీ, నేరం రుజువు కాకుండానే నిందితులు శిక్షలను అనుభవిస్తున్నారు. పూర్వ పాలకుల మీద కక్ష సాధించే అవకాశం అనంతర పాలకులకు ఉంటుంది కాబట్టే, అవినీతి నిరోధక చట్టంలో 17ఏ సవరణ చేశారు. ఆ చట్టం వర్తింపే ఇప్పుడు వివాదమై, కక్షసాధింపు ఆశయం మాత్రం నెరవేరుతోంది. సుదీర్ఘకాలం నిందితులను బందీలుగా ఉంచే అవకాశం లేని విధంగా తగిన చట్టబద్ధమైన కట్టుదిట్టాలు చేయాలి. ప్రస్తుతానికి, రాజకీయమైన పగలకు ప్రతీకారాలకు సమాధానం రాజకీయాలలోనే వెదుక్కోవాలి. కక్ష పూరిత ప్రభుత్వాల నుంచి అధికారాన్ని వెనక్కి తీసుకోవాలి. బహుశా, ప్రజలు ఆ దిశగా ఇప్పటికే ఆలోచించడం మొదలుపెట్టి ఉంటారు.

# ఎర్రవల్లిలో కేసీఆర్‌చే రాజశ్యామల యాగం

- యాగాన్ని పర్యవేక్షిస్తున్న విశాఖ శ్రీ శారదాపీఠం
- మూడు రోజులపాటు కొనసాగనున్న యాగం
- స్వరూపానందేంద్ర ఆశీస్సులు అందుకున్న కేసీఆర్
- కేసీఆర్ కుటుంబానికి రాజశ్యామల అనుగ్రహం ఉండాలన్న పీఠాధిపతులు





తెలంగాణ (విజయభాను న్యూస్): విశాఖ శ్రీ శారదాపీఠం పర్యవేక్షణలో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజశ్యామల యాగం చేపట్టారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో బుధవారం ఉదయం యాగం ప్రారంభమైంది.పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాముల ఆధ్వర్యంలో యాగానికి అంకురార్పణ జరిగింది. రాజశ్యామలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగంగా దీనికి నామకరణం చేసారు. కేసీఆర్ దంపతులు యాగ సంకల్పం చెప్పి పండితులకు దీక్షా వస్త్రాలను ప్రదానం చేసారు. తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 170 మంది రుత్విక్కులు ఇందులో పాల్గొంటున్నారు. ఈసందర్భంగా స్వరూపానందేంద్ర స్వామి మాట్లాడుతూ రాజశ్యామల యాగం ప్రాముఖ్యతను వివరించారు. రుద్ర, చండీ, వనదుర్గ హెూమాలు అన్నిచోట్లా జరుగుతాయని, రాజశ్యామల యాగం విశిష్టమైనదని తెలిపారు. రాజులతో పాటు సామాన్యులను అనుగ్రహించే రాజశ్యామల యాగం కఠినమైన భీజాక్షరాలతో కూడినదని వివరించారు. మహా శక్తివంతమైన రాజశ్యామల యాగ ఫలితం ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబానికే కాదని, యావత్ రాష్ట్రానికీ ఉంటుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలమైందన్నా, హైదరాబాద్ మహానగరంగా అభివృద్ధి చెందిందన్నా గతంలో కేసీఆర్ చేసిన రాజశ్యామల యాగం ఫలితమేనని అన్నారు. మహాభారతం చదివిన జ్ఞాని కేసీఆర్ అని అభివర్ణించారు. ముఖ్యమంత్రులు ఎందరో తనకు తెలిసినా హైందవ తత్త్వం పరిపూర్ణంగా తెలిసిన నేత కేసీఆర్ మాత్రమేనని తెలిపారు. బ్రాహ్మణుల సంక్షేమాన్ని కోరుకున్న కేసీఆర్ కుటుంబానికి రాజశ్యామల అనుగ్రహం పరిపూర్ణంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. శ్రీ శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారు కొలువై ఉన్న ఏకైక పీఠం విశాఖ శ్రీ శారదాపీఠమేనని స్పష్టం చేసారు. హిమాలయాల్లో మహాత్ముల చెంత అమ్మవారి ఉపాసన పొందానని తెలిపారు. కేసీఆర్ కుటుంబం, బంధుమిత్రులతో పాటు రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ తదితరులు యాగంలో పాల్గొన్నారు.

#### శాస్త్రోక్తంగా యాగానికి అంకురార్పణ...

తెలుగు రాష్ట్రాల సర్వతోముఖాభివృద్ధిని, సస్యశ్యా మలం కావాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన ఈ యాగానికి రాజశ్యా మలా సహిత సుబ్రహ్మణ్యేశ్వర యాగంగా నామకరణం చేసారు. శాస్త్రోక్తంగా ప్రారంభమైన యాగం మూడు రోజులపాటు కొనసాగుతుంది. ఉదయం గోపూజ అనంతరం కేసీఆర్ దంపతులు యాగశాల ప్రవేశం చేసారు. గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ప్రాసనతో యాగానికి అంకురార్పణ జరిగింది. కేసీఆర్ దంపతులు పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి యాగంలో ఆసీనుల య్యారు. గురు ఆజ్ఞ తీసుకుని యాగాన్ని ప్రారంభించారు. కేసీఆర్ దంపతులతో స్వరూపానందేంద్ర స్వామి యాగ సంకల్పం చెప్పించారు. విశాఖ శ్రీ శారదాపీఠ అధిష్టాన దైవం రాజశ్యామల అమ్మవారికి స్వరూపానందేంద్ర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశ్యామల అమ్మవారిని వనదుర్గ అవతారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాగం నిర్విఘ్నంగా కొనసాగాలని ముక్కోటి దేవతలను ప్రార్థిస్తూ అస్త్ర రాజార్చన, కర్కరీయ స్థాపన నిర్వహించారు. అఖండ స్థాపన అనంతరం అగ్నిమధనం చేసి యాగశాలలో అగ్నిని ప్రతిష్టించారు.







## వేతన సవరణపై ప్రధాని మోదీకి రైల్వే ఉద్యోగుల లేఖ..

ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు సవరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ ప్రధాని నరేంద్ర మోదీ కి లేఖ రాసింది. 8 ఏళ్లు గడిచినా ఇప్పటికీ వేతన సవరణ చేయలేదంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 1, 2016 నుండి 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సును అమలు చేసి, కనీస వేతనాన్ని రూ. 18వేలుగా నిర్ణయించారు. సవరించిన వేతన విధానం అమలులోకి వచ్చి దాదాపు ఎనిమిదేళ్లు గడుస్తున్నా వేతన సవరణ, 8వ కేంద్ర వేతన సంఘం ఏర్పాటుపై ప్రభుత్వం ఇంకా స్పందించట్లేదని ఎన్‌ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి ఎం రాఘవయ్య లేఖలో పేర్కొన్నారు. తమ డిమాండ్‌కు మద్దతుగా, ఫెడరేషన్ 7వ సిఫార్సులలో ఒకదానిని ప్రధాని దృష్టికి తీసుకువచ్చింది.

సవరణకు 10 సంవత్సరాలపాటు ఎదురు చూడకుండా.. కాలానుగుణంగా మార్పులు చేస్తే ఉద్యోగులకు మంచి జరుగుతుందని ఆ సిఫార్సులో ఉంది. సిమ్లాలోని లేబర్ బ్యూరో క్రమం తప్పకుండా వస్తువుల ధరలను బట్టి వేతన సవరణ చేస్తుందని అదే విధానాన్ని ఆచరించవచ్చిని సూచించింది. ఫెడరేషన్ వివరాల ప్రకారం.., 2016తో పోల్చితే నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. దీని వలన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ కనీస వేతనం, సవరించిన వేతనాన్ని సమానంగా అందించాలని అందులో ఉంది. "డా. అక్రాయిడ్ ఫార్ములా ప్రకారం.. వివిధ వస్తువుల ధరల ఆధారంగా,

జులై 1, 2023 నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కనీస వేతనం నెలకు రూ.32,500 కంటే తక్కువ ఉండరాదు. అయితే ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.18,000 కి 46% డియర్‌నెస్ అలవెన్స్‌ని జోడించిన తర్వాత కూడా ఉద్యోగి కనీస వేతనం చాలా తక్కువ అని లేఖలో పేర్కొన్నారు. "కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన నిర్మాణం, 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల ఆధారంగా కనీస వేతన సవరణ కోసం చర్యలు తీసుకోవాలని ప్రధానిని కోరారు.

దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పందించలేదు. వేతన సవరణ జరిగితే లక్షల సంఖ్యలో ఉన్న ఉద్యోగులకు లబ్ధి జరగనుంది.

## సంకీర్తన

### అదే సుబ్రహ్మణ్యస్వామి మహిమ!



భక్తుల కోరికలను నెరవేర్చడం కోసం సుబ్రహ్మణ్య స్వామి వివిధ ప్రదేశాల్లో అవతరించాడు. అలాంటి విశిష్టమైన క్షేత్రాల్లో ఒకటి అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం 'కోటంక' గ్రామంలో దర్శనమిస్తుంది. ఇక్కడి సుబ్రహ్మణ్య స్వామి మహి మాన్వితుడని భక్తులు విశ్వసిస్తుంటారు. ఇక్కడ స్వామి స్వయంభువుగా వెలిశాడనీ .. పూర్వం స్వామి సర్ప రూపంలో మహర్షులకు దర్శనమిస్తూ వుండేవాడని చెబుతుంటారు.

ఇక్కడ స్వామివారి సన్నిధిలో పాతాళగంగ వుంది. ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఇందులోని నీటి ధార తగ్గకపోవడం విశేషంగా చెప్పుకుంటూ వుంటారు. ఇది స్వామివారి మహిమగా విశ్వసిస్తూ వుంటారు. ఈ నీటిని స్వామివారి అభిషేకానికి ఉపయోగిస్తారు. పాతాళ గంగలోని నీటిని తీర్థంగా స్వీకరించడానికి భక్తులు మరింత ఆసక్తిని చూపుతారు.

ఈ నీటిని తీర్థంగా స్వీకరించడం వలన, దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుముఖం పడతాయని అనుభవపూర్వకంగా చెబుతుంటారు. వివాహం విషయంలోను .. సంతాన భాగ్యం విషయంలోను ఆలస్యమవుతున్నప్పుడు, ఈ స్వామిని దర్శించుకుని మనసులో మాట చెప్పుకుంటే ఆ కోరిక నెరవేరుతుందని అంటారు. ఈ క్షేత్రంలో అడుగుపెట్టడం వలన సమస్త దోషాలు తొలగిపోతాయనీ, పుణ్యఫలాలు చేకూరతాయని చెబుతారు. విశేషమైన పర్వదినాల్లో స్వామివారిని దర్శించుకునే భక్తుల సంఖ్య ఎక్కువగా వుంటుంది. ఆహ్లాదకరమైన ఈ క్షేత్రాన్ని దర్శించడం వలన మనసుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది.

### శివలింగారాధన ఫలితం!

పరమశివుడు లింగరూపంలో ఆవిర్భవించి, భక్తులచే పూజాభిషేకాలు అందుకుంటున్నాడు. శివలింగారాధన వలన విశేషమైన ఫలితాలు కలుగుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. బంగారం .. వెండి వంటి లోహపదార్థాలతో తయారు చేయబడిన శివలింగాలను, బాణలింగం .. స్పటిక లింగం వంటి వాటితో రూపొందించబడిన శివలింగాలను పూజించడంవలన విశేషమైన ఫలితాలు కలుగుతాయని చెప్పబడుతోంది. మట్టితోను .. వెన్నతోను .. పిండితోను ఇలా వివిధ రకాల పదార్థాలతో తయారుచేయబడిన శివ లింగాలను ఆరాధించడం వలన, పుణ్య రాశి పెరుగుతుంది. మనసులోని కోరికలను బట్టి ఆయా శివలింగ రూపా లను పూజించవలసి వుంటుంది. సాధా రణంగా చాలామంది ఆరోగ్యాన్ని .. ఐశ్వ ర్యాన్ని కోరుకోవడం జరుగుతూ వుంటుంది. ఆనందకరమైన జీవితాన్ని గడపడానికి ఐశ్వర్యం .. ఆరోగ్యం రెండూ అవసరమే. అందువలన వాటిని కోరుకోవడం జరుగుతూ వుంటుంది.'పటిక బెల్లం'తో తయారు చేయబడిన శివలింగాన్ని పూజించడం వలన, ఆరోగ్యం కలుగుతుందని చెప్పబడుతోంది. ఇక ఐశ్వర్యాన్ని కోరుకునేవారు 'కపిల గోవు' పేడతో చేసిన శివలింగాన్ని ఆరాధించవలసి ఉంటుంది. అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ శివలింగాలను పూజించడం వలన, ఆశించిన ఫలితం తప్పక లభిస్తుందని స్పష్టం చేయబడుతోంది.



# జగనన్న లేఅవుట్ పరిశీలించిన పిఓ విష్ణు చరణ్



సాలూరు విజయభాను న్యూస్ నవంబరు 1 : సాలూరు మున్సిపాలిటీ పరిధిలో జగనన్న పట్టణ గృహ నిర్మాణం లేఅవుట్ నెలిపర్తి దగ్గర, నిర్మాణం అవుతున్న దానిని ఆకస్మితిగా ఐ టి డి ఏ ప్రోజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ పరిశీలించారు. లేఅవుట్ లో అప్రోచ్ రోడ్లు నిర్మాణం, నీటి సదుపాయం కొరకు బోర్ వెల్ డ్రిల్లింగ్ పనులను వెంటనే మొదలు పెట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ టి జయరాం, ఇంజనీరింగ్ అధికారులను లేఅవుట్ లో వసతులు సక్రమంగా నిర్మాణం అవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇల్లు పూర్తిస్థాయిలో లబ్ధిదారులు చే నిర్మాణం జరిగేటట్లు చేయాలని, వారికి కావలసిన సదుపాయాలు అందించాలని కమిషనర్ ను ఆదేశించారు. అనంతరం పాచిపెంట మండలం పి.కోనవలస లో ఎ.పి.టి.డబ్ల్యు.ఆర్.జే.సి. బాలికల కాలేజీని తనిఖీ చేసారు. తరగతి గదులు, వంటగది, బోజనాలు హాలు పరిశీలించారు. స్టాక్ రూం, రిజిస్టర్ లు తనిఖీ చేసారు. హాస్టల్ లో గల వసతులు, సమస్యల గూర్చి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ఎటువంటి యిబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని హాస్టల్ వార్డెన్ కు, విద్యను పూర్తి స్థాయిలో అందించాలని ఉపాధ్యాయులను అదేశించారు.

ఈ కార్యక్రమంలో సాలూరు మునిసిపల్ కమిషనర్ టీ జయరాం, అదికారులు, ఇంజనీరింగ్ అధికార్లు, గ్రామీణ నీట సరఫరా విభాగం అధికారులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ నాగేశ్వరావు మృతికి శ్రద్ధాంజలి ఘటించిన డాక్టర్ తమర్భ నర్సింగరావు..

అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్..పాడేరు...చింతపల్లి విలేకరి నాగేశ్వరావు గారి మృతికి ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ తమర్ప నర్సింగ రావు శ్రద్ధాంజలి ఘటించారు. నాగేశ్వరరావు అనారోగ్యంతో బుధవారం తుది శ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో జీకే వీధిలోని నాగేశ్వరావు స్వగృహం వద్ద ఆయన మృతదేహాన్ని సందర్శించి పూల మాలలు వేసిన నివాళు లర్పించారు. జర్నలిస్టు నాగేశ్వరావు గారి మృతి తనను కలిచి వేసిందని, మంచి మనసున్న వ్యక్తిని కోల్పోయామని చెప్పారు. ఆయన కుటుంబానికి తమంత అండగా ఉంటామని చెప్పారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఓదార్చి, ఆర్థిక సాయం అందించారు.

## భవిష్యత్తులో వైసీపీ పతనం ఖాయం : మాజీ మంత్రి కోండ్రు



రాజాం : మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రజా క్షేత్రంలోకి రావడం పట్ల మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ హర్షం వ్యక్తం చేస్తూ నాయకులకు స్వీట్స్ పంచారు. అనంతరం రాజాం టౌన్.రూరల్. రేగిడి.సంతకవిటి.వంగర మండల నాయకులు.క్లస్టర్ ఇంఛార్జిలు. యూనిట్ ఇంఛార్జిల తో రాజాం తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద బాబు షూరిటీ - భవిష్యత్ కు గ్యారెంటీ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోండ్రు మాట్లాడుతూ నెలరోజుల్లో నియోజకవర్గం మొత్తం బాబు షూరిటీ - భవిష్యత్ కు గ్యారెంటీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఓటర్ లిస్టులను నిశితంగా పరిశీలించి.కొత్త ఓటర్లను నెలాఖరులోపు యాడ్ చేయాలని అన్నారు.రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి జరగాలంటే మళ్ళీ చంద్రబాబును ముఖ్యమంత్రి చేసే వరకు నాయకులు. కార్యకర్తలు. అభిమానులు. అలుపెరగని పోరాటం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ అధ్యక్షులు నంది సూర్యప్రకాష్ రావు, పొట్టా చిట్టిబాబు, గురవాన నారాయణరావు,ఉరిటి సురేంద్ర గేదెల బాలమురళి, వల్లూరు గణేష్, వావిలపల్లి శ్రీను,మజ్జి శ్రీను, బాణాన విష్ణు, రఘు మండల గణపతి నాయుడు, మాడుగుల జయరాం, బాలిజి రెడ్డి శ్రీను, బెజ్జి పురపు రవి, లచ్చుభుక్త కృష్ణ మూర్తి, గుడివాడ మహేష్, గురువాన రమేష్,కెంబూరు ధనంజయ, మజ్జిగ గణపతి, వేగిరెడ్డి శంకరరావు, జిటి నాయుడు, గన్ను రమేష్, పిల్ల సత్యనారాయణ,ధనుంజయ్ తదితర యూనిట్ ఇన్చార్జిలు భూత్ ఇంచార్జిలు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెసా కమిటీ సభ్యులకు శిక్షణా కార్యక్రమం



అరకులోయ( విజయభాను న్యూస్ )అరకులోయ మండల పద్మపురం లోగల. నేచర్ స్వచ్ఛంద సంస్థనందు డైరెక్టర్ ఎస్ వికాస్ బాలరాజు ఆదేశాల మేరకు నేచర్ - ట్రైబల్ ఫౌండేషన్ బెడ్డగూడ గ్రామంలో పెసా కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించచరు .ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వికాస్ బాలరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో గిరిజనులకు ఎంతో బలమైనటువంటి చట్టబద్ధమైనటువంటి పెసా కమిటీలను బలపరచాలని ఈ కమిటీ ద్వారా గ్రామస్థాయిలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలియజేస్తూ నేచర్ సిబ్బంది ద్వారా గ్రామస్థాయిలో అమ్మఒడి,రైతు భరోసా, పింఛను, పిఎం కిసాన్,రైస్ కార్డులో యాడింగ్ మరియు స్ప్లిట్టింగ్,జాబ్ కార్డు లో యాడింగులు ప్రతి కుటుంబంలో ఉండాల్సిన ముఖ్యమైన పత్రాలు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, వాటర్ ఐడి కార్డ్, బ్యాంక్ అకౌంట్,ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు, ఆరోగ్యశ్రీ కార్డులు ఈ పత్రాలు మరియు ప్రభుత్వ పథకాలు పొందడంలోనూ గిరిజన ప్రాంతంలో చాలా సమస్యలు ఉన్నాయని వీటి పరిష్కారానికి పెసా నోటిఫైడ్ గ్రామాల్లో గ్రామసభలు జరిపి ప్రజల సమస్యలపై తీర్మానం చేసి ఆ తీర్మానాన్ని గ్రామపంచాయతీలో పంచాయతీరాజ్ శాఖ ఆమోదం పొంది సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మాదల 2, గన్నేల 3,ఇరగాయి 4, లోతేరు 6, బొండం 5, సుంకరమెట్ట 3, బస్కి 7,కురిడి 7, సాగర 5, సొవ్వ 6,కంద్రుము 4,కల్లాపుట్ 5, మొత్తం 57 మందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. 1996లో భారత దేశంలో ఈ చట్టాన్ని తీసుకువచ్చారని 1998లో బురియా కమిటీ ద్వారా పది రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేశారని 2011లో ఈ చట్టంలో కొన్ని గైడ్లెన్స్ మార్పులు చేర్పులు చేయడం జరిగిందని 2013లో పేసా కమిటీలు ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరిగిందని మండల కోఆర్డినేటర్ కొర్రా అద్దు తెలియజేశారు.పేసా కమిటీ సభ్యుల ఫీడ్బ్యాక్ ఆధారంగా వీటి పరిష్కారానికి అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ గారికి వినతిపత్రం అందజేసి ఎన్నికలు జరిగేలా ప్రయత్నం చేద్దామని ఈ సమావేశంలో ప్రణాళిక రూపొందించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో గిరిజన వారిది ప్రాజెక్ట్ మేనేజర్ అనిష్, జీ.యస్ నాయక్,అడ్మిన్ సుభాష్,కల్చరల్ డైరెక్టర్ సంతోష్, సిబ్బంది రవి పద్మ శాంతి చైతన్య మండల కోఆర్డినేటర్లు అద్దు,బంగారు బాబు, ప్రసాద్, సింహాచలం 12 పంచాయతీల కమ్యూనిటీ మొబిలైజర్లు హాజరయ్యారు.

# భావి తరాలకు పొట్టి శ్రీరాములు ఆదర్శం




విశాఖ రురల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : ఆంధ్రప్రదేశ్ అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన కృషి భావితరాలకు స్ఫూర్తిదాయకమని నకర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం మహా విశాఖ 8 వ వార్డు పరిధి ఎండాడ లా కాలేజీ రోడ్డు లో గల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాలను గుర్తు చేశారు. తెలుగు జాతి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కావాలని ఆయన ప్రాణత్యాగం చేసిన మహనీయులని మేయర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, రాష్ట్ర అదనపు కార్యదర్శి జి.రవి రెడ్డి, నడింపల్లి కృష్ణంరాజు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ చందర్, వివిధ కార్పొరేషన్ ల చైర్మన్లు పిల్లి సుజాత, పిల్లా సుజాత సత్యనారాయణ, అప్పలకొండ, మాధవి వర్మ, అనుబంధ విభాగాల జోనల్ ఇన్చార్జిలు మారుతీ ప్రసాద్, అల్లంపల్లి రాజబాబు, బెందాలం పద్మావతి, కే రామన్న పాత్రుడు అనుబంధ విభాగాల అధ్యక్షులు బోని శివరామకృష్ణ, ఈశ్వర రావు, కె.వి బాబా, పెంద్ర అప్పన్న, మన్యాల శ్రీనివాస్, నమ్మి లక్ష్మణరావు, నాయుకులు దాడి సత్యనారాయణ, ఆల్ఫా కృష్ణ, మధు సంపతి తదితరులు పాల్గొన్నారు.

# మీ విజయాలు గిరిజన యువతకు స్ఫూర్తి

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్




అల్లూరిజిల్లా. విజయభాను. న్యూస్.. పాడేరు.. అంకితభావంతో ప్రిపరేషన్ కొనసాగించి ఉత్తమ ఫలితాలు సాధించి గిరిజన యువతకు స్ఫూర్తిగా నిలవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేసారు. ఐటిడిఏ ఆధ్వర్యంలో గిరిజన యువతకు అందిస్తున్న సివిల్స్ ఉచిత శిక్షణా కార్యక్మ్రన్ని బుధవారం వేపగుంట యూత్ శిక్షణా కేంద్రంలో ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడితే విజయం సాధ్యమని విజయం సాధించే వరకు రెండు మూడు సంవత్సరాలు సాధన చేయాలన్నారు. పోటీ పరీక్షలకు సద్దంమయ్యే యువతకు క్రమ శిక్షణ ముఖ్య మన్నారు. కష్టపడితే విజయం సాధ్యమవుతుందన్నారు. సమయం ఉన్నప్పుడు ఆంధ్రా మెడికల్ కళాశాల లైబ్రేరీని సందర్శించి అక్కడ వైద్య విద్యార్దులు చదువుతున్న విధానాన్ని పరిశీలించాలని అన్నారు. మెడికల్ విద్యార్దులు ప్రతీ రోజు ఎనిమిది గంటలు సాధన చేస్తారని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్దమవుతున్న యువత సామాజిక మాధ్యమాలకు , చరవాణీలకు దూరంగా ఉండాలని చెప్పారు. చాలా మంది యువత చరవాణీలతో సమయం వృధా చేసుకుంటున్నారని అన్నారు. ప్రతీ రోజు న్యూస్ పేపర్లను ఒక పాఠ్యాంశంగా చదవాలని సూచించారు. మానసికంగా ధృడంగా ఉండి పోటీ పరీక్షలలో మంచి ఫలితాలు సాధించి తలిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు.ప్రభుత్వ కొలువులు సాధించడమే లక్ష్యం ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ గిరి శిఖర గ్రామాల యువత ఉన్నతమై ప్రభుత్వ కొలువు సాధించడమే లక్ష్యంగా ప్రిపరేషన్ చెయ్యాలని అన్నారు. ఐటిడి ఏ అందిస్తున్న ఉచిత సివిల్స్ శిక్షణను సద్వని యోగం చేసుకోవాలని చెప్పారు. 65 మంది గిరిజన యువతను ఎంపిక చేసి 9 నెలలు శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. నూటి నూరు శాతం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గిరిజన ప్రాంతానికి మంచి పేరు తీసుకుని రావాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఊరికే రావని పట్టుదల, ఓపిక, నమ్మకంతో ప్రిపేరవ్వాలని పేర్కొన్నారు. ప్రతిరోజు సమయానికి శిక్షణా తరగతులకు హాజరయ్యి, ఏరోజు చెప్పని పాఠ్యాంశాలను ఆరోజే చదవాలన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. సివిల్స్ఉచితశిక్షణకు పూర్తిసహాయసహ కారాలందించిన గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ఎటిడబ్ల్యు ఓలు ఎల్.రజని, అఖిలా రెడ్డిలను శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం శిక్షణకు ఎంపికైన అభ్యర్దులతో కలిసి డాక్యుమెంటరీని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో 21వ సెంచరీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ అధినేత ధరణి , శిక్షణ పొందుతున్న అభ్యర్దులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్ నగర పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

- సుమారు 1100 మందితో బందోబస్తు
- విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్. ఏ.రవి శంకర్(ఐ.పీ.ఎస్)




విశాఖపట్నం (విజయభాను న్యూస్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విశాఖపట్నం పర్యటనలో భాగంగా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఏ రవిశంకర్ ఓ ప్రకటనలో తెలియజేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు సుమారు 1100 మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు.

25 వ ఇంటర్నేషనల్ కమీషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ కాంగ్రెస్ ప్లీనరీ ప్రారంభోత్సవ కార్యక్రమం నందు పాల్గొనటకు గానూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన రెడ్డి నగరంలో పర్యటించనున్న నేపథ్యంలో సుమారు 1100 మందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టడం జరిగినది.

ప్లీనరీ నందు పాల్గొనటకు వచ్చిన పలు దేశాల ప్రతినిధులకు తగు భద్రతా ఏర్పాట్లు కల్పించి ఎటువంటి అవాంఛనీయ సంఘనలు జరుగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగినది. బందోబస్తును పలు కేటగిరిలుగా విభజించి, పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఒక్కొక్క విభాగానికి ఒక్కొక్క పోలీసు ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించడం జరిగినది.

ముఖ్యమంత్రి పర్యటనలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టడం జరిగినది.

ఎయిర్పోర్ట్ వద్దా, పార్కింగు, కాన్వాయ్, హెలిప్యాడ్ వద్దా , రాడిసన్ బ్లూ తో పాటుగా విదేశీయులు బస చేసిన అన్ని హొటళ్ల వద్ద భద్రత చేపడుతున్న అధికారులు మరియు సిబ్బంది ఆయా ప్రాంతాలలో విధులపై పూర్తి అవగాహన కలిగి బందోబస్తు చర్యలు చేపట్టడం జరుగుతుంది.

నగరంలో వాహనాల రాక పోకలకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా ట్రాఫిక్ రెగ్యులేషన్ చేపట్టేందుకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించడం జరిగినది.

వి.ఐ.పిలు పాల్గొనే ప్రాంతాలలో స్నిఫర్ డాగ్ స్క్వాడ్లతో, బాంబు స్క్వాడ్లతో పరిశీలించడం జరిగినది, ఏ.ఎస్.సి ,ఆర్.ఓ.పి లను నిర్వహిస్తూ గౌరవ ముఖ్యమంత్రి పర్యటించే రహదారులను తనిఖీ చేయడం జరుగుతుంది. ముఖ్యమంత్రి పర్యటనలో పాల్గొనే ముఖ్య వ్యక్తుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసే ఇతరుల వాహనాలకు వేరు వేరుగా పార్కింగు చేసుకొనే విధంగా పార్కింగు స్థలాలు ఏర్పాటు చేయడం జరిగినది.

ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అన్ని భద్రతా చర్యలు చేపట్టడం జరిగినది. ఇప్పటికే సి.పి ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను సందర్శించి, ముందస్తుగా భద్రతా ఏర్పాట్లును సమీక్షించారు.

బుధవారం సీపీ ఆదేశాలతో డి సి పి-01(ఎల్ & ఓ) , డి సి పి-02(ఎల్ & ఓ) , డి సి పి(క్రైమ్స్ ) వారు ఈ బందొబస్తూ లో విధులు నిర్వహించనున్న అధికారులకు బ్రీఫింగ్ కార్యక్రమం నిర్వహించడం జరిగినది.

# తీర ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి అభివృద్ధి

- రూ.78.61 లక్షల వ్యయంతో గోకుల్ పార్కు అభివృద్ధి
- నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి



మహారాణిపేట (విజయభాను న్యూస్): తీర ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి అభివృద్ధి చేయడం జరుగుతుందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె మూడవ జోన్ 29వ వార్డు పరిధిలోని బీచ్ రోడ్ లోని గోకుల పార్కును సుమారు రూ.78.61 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్, వార్డ్ కార్పొరేటర్ ఉరుకుటి నారాయణ తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరానికి సువిశాలమైన తీర ప్రాంతం ఉందని ఎంతోమంది సందర్శకులు, పర్యాటకులు నగరానికి వస్తూ ఉంటారని వారికి ఆహ్లాదం కల్పించేందుకు తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయటం జరుగుతుందని అందులో భాగంగా ఆర్కే బీచ్ వద్ద గోకుల్ పార్కును అభివృద్ధిపరిచేందుకు శంకుస్థాపన చేశామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విశాఖ తీర అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని ఆ దిశగా నేడు అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు మాట్లాడుతూ త్వరలో విశాఖపట్నం పరిపాలన రాజధాని అవుతున్న దృశ్య విశాఖ నగరానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని ఎంతోమంది పర్యాటకులు సందర్శకులు నగరానికి వస్తారన వారందరికీ ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు తీర ప్రాంతం అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కార్యనిర్వాహక ఇంజనీరు సత్యనారాయణ, ఇతర అధికారులు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సనపల రవీంద్ర భరత్, వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులకు శాపం.. ఆటిజం!

మెడ నిలపటం, పాకటం, తప్పటడుగులు, అత్తతాతలు.. పిల్లల ఎదుగుదల క్రమంలో ప్రతిదీ ఒక పండేగ. వీటిలో ఏదైనా తేడా వచ్చినప్పుడు తల్లిదండ్రులు తేలికగానే గుర్తుపడతారు.. వెంటనే దృష్టిసారిస్తారు కూడా. కానీ ఈ గడపలన్నీ దాటి.. ప్రయాణం బాగానే సాగుతోందనుకుంటున్న తరుణం లో కూడా కొన్ని సమస్యలు ఉండొచ్చు. వీటిని గుర్తిం చటం అంత తేలిక కాదు. వాటిని పట్టుకోవటానికి కాస్త అవగాహన అవసరం. ఇలాంటి సమస్యల్లో ముఖ్యమైనదీ.. ఇప్పటి వరకూ పాశ్చాత్య దేశాల్లోనే ఎక్కువ అనుకుంటున్నదీ... సంపన్న వర్గాల్లోనే ఎక్కువ అనుకుంటున్నదీ.. మన దేశంలోనూ, అన్ని వర్గాల్లోనూ ఎక్కువేనని ఇప్పు డిప్పుడే స్పష్టంగా బయటపడు తున్నదీ... ఆటిజం! ఆటిజం భిన్న విభాగాలకు విస్తరిం చిన ఎదుగుదల సమస్య. దీన్నే పర్వేసి డెవలప్‌మెం టల్ డిసార్డర్స్ అంటారు. వీరందరిలోనూ కొన్ని రకాల లక్షణాలు ప్రత్యేకంగా కన బడతాయి. కొన్ని అంశాల్లో ఎదుగుదల అస్తవ్యస్తమవు తుంది. ముఖ్యంగా మూడు అంశాలను ప్రత్యేకంగా గమనించొచ్చు.

**ఇతరులతో కలవలేకపోతుండటం:** ఆటిజం పిల్లలు తోటి పిల్లలతో ఆడుకోవటానికి అంతగా ఇష్టపడరు. ఒంటరిగా ఆడుకోవటం, ఒంటరిగా గడపటం ఎక్కువ.

**భావవ్యక్తీకరణ లోపం:**

మాటలు రావటం జాప్యం కావచ్చు. వచ్చినా పూర్తిస్థాయిలో ఉండకపోవచ్చు. తమ అవసరాలను తీర్చుకునేందుకు వేలుపట్టుకుని అక్కడి వరకూ తీసుకువెళ్ళటం వంటివి చేస్తుంటారు.

**ప్రవర్తన లోపాలు:**

చేసిందే మళ్లీ మళ్లీ చేస్తుండటం, ఒకపనిని ఎప్పుడు చేసినా తిరిగి అలాగే చెయ్యాలని ప్రయత్నిస్తుం డటం... రోజూ తాము వాడే టాయిలెట్‌నే వాడతామం టారు. రెండోదానిలోకి వెళ్ళనని మొరాయిస్తుంటారు. కొందరు సంతోషం కలిగితే చేతులను కాళ్ళను పైకీ కిందికీ అదేపనిగా ఆడిస్తారు. మరి కొందరు సూదులు, గుండుపిన్నుల వంటి బేక రకం వస్తువులను సేకరిస్తుంటారు..... ఆటిజం పిల్లల్లో సాధారణంగా ఈ మూడు లక్షణలూ ఉంటాయి. కొందరిలో ఒకటిరెండు మాత్రమే ఎక్కువగా కనబడినా అన్ని లక్షణలూ ఏదో ఒక స్థాయిలో కనబడతాయి. అమెరికా డయాగ్నోస్టిక్ అండ్ స్టాటిస్టికల్ మాన్యువల్‌లో దీన్ని పర్వేసి డెవలప్‌మెంటల్ డిజార్డర్ కింద దీన్ని వర్గీకరించారు. ఈ లక్షణాలు ఆరంభమైన సమయం, తీవ్రత, క్షీణిస్తున్న తీరు తదితర అంశాలను బట్టి దీన్ని ప్రధానంగా 5 రకాలుగా విభజించారు.

**ఆటిస్టిక్ డిజార్డర్:**

ఎక్కువగా కనబడే ఆటిజం సమస్య ఇదే. దీన్ని చైల్డ్‌హుడ్ ఆటిజం అంటారు. ఇది ఆడ పిల్లల్లో కన్నా మగపిల్లల్లో ఎక్కువ. ముమ్మందు వివరంగా చూద్దాం.

**రట్స్ డిజార్డర్:**

అరుదైన ఈ రకం ఆడపిల్లల్లో ఎక్కువగా కనబడుతుంది. దీని ప్రత్యేకతేమంటే.. పుట్టిన ఏడాది వరకూ పిల్లలు బాగానే ఉంటారుగానీ తర్వాత లక్షణాలు కనబడటం మొదలవుతుంది.

ఇవి రెండు మూడేళ్ళలోనే వేగంగా తీవ్రమవుతాయి. అప్పటికి వచ్చిన ఒకటిరెండు మాటలు కూడా తిరిగి వెనక్కి వెళ్లిపోతాయి. ఇది ముదిరే రకం (ప్రోగసి డిజార్డర్) కావటం వల్ల కొంతకాలానికి నాడీ సంబంధ సమస్య లూ ఆరంభమవుతాయి. సరిగా నడుము నిలపలేక పోతుండటం వంటివాటితో మొదలై మెల్లగా ఫిట్స్ కూడా వస్తాయి. సాధారణంగా వయసుతో పాటు పెర గాల్సిన తల వీరిలో చిన్నదవుతుంటుంది. చొంగ కారటం, చేతులుకాళ్లు బేక రకంగా ఆడిస్తుండటం, చేతులతో చప్పుళ్లు చేయటం వంటివి కనబడతాయి. యుక్తవయసుకు ముందే సమస్యలు బాగా ముదిరి వీరు బతికిబట్టకట్టటం కూడా కష్టమవుతుంటుంది.

**ఆస్పర్జెర్స్ డిజార్డర్:**

ఇది మగ పిల్లల్లో ఎక్కువ. సాధారణంగా ఆటిజం పిల్లల్లో మాటలు ఆలస్యంగా వస్తుంటాయి. కానీ ఈ రకంలో మాటలు మామూలుగానే ఉంటాయి. నలుగురిలోకి వెళ్ళటం, తెలివి తేటలు కూడా బాగానే ఉంటాయి. కానీ తక్కువగా మాట్లాడతారు. అడిగిన దానికి సమాధానం చెప్పేసి ఆపేస్తారు. శరీరాకృతి భిన్నంగా ఉంటుంది. పొడుగ్గా ఉంటారు. పొడవైన ముంతో పాటు చెవులూ భిన్నంగా ఉంటాయి. మిగతా ఆటిజం పిల్లలతో పోలిస్తే ఇతరులతో బాగానే కలు స్తారు కాబట్టి వీరిలో భాషా నైపుణ్యాలు కాస్త ఎక్కువ గానే అలవడతాయి. కొంతవరకూ బాగానే చదువు

# పిత్తాశయంలో రాళ్ళ తొలగించే నేచురల్ ఫుడ్స్



ప్రస్తుత రోజులో గాల్ స్టోన్స్(పిత్తాశయంలోరాళ్ళు) ఒక సాధారణ సమస్యగా ఉంది. అదృష్టవశాత్తూ, గాల్ స్టోన్ నివారించుకోవండానికి కొన్ని హోం రెమెడీస్ ఉన్నాయి. ఈ గాల్ బ్లాడర్ అనేది చిన్న అవయం లివర్ కు వెనుకభాగంలో ఉంటుంది. పిత్తాశయం అనేది ఒక సంచి వంటి నిర్మాణం. ఇది కాలేయం కింది భాగంలో ఉంటుంది. ఆహారం అరుగుదలకు ఉపయోగపడే స్రావాలను నిల్వ ఉంచుతుంది. ఇవి కాలేయం నుండి స్రవిస్తాయి. పిత్తాశయంలో రాళ్ల అనేవి కొలెస్ట్రాల్, పిగ్మెంట్స్‌వల్ల ఏర్పడిన ఘనపదార్థాలు. ఇవి సన్నని ఇసుకు రేణువు పరిమాణం నుండి గోల్ఫ్‌బాల్ పరిమాణంలోగానీ, గుండ్రంగాగానీ, నున్నగాగానీ ఉండవచ్చు. వీటికి చికిత్స తీసుకోకపోతే తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చు. కొన్నిసార్లు ప్రాణాంతకం కావచ్చు. కొన్ని సందర్భాల్లో కొలెస్ట్రాల్, బిలిరుబిన్ మరియు బైల్ సాల్ట్ ల కారణంగా గాల్ బ్లాడర్లో స్టోన్స్ ఏర్పడుతాయి . 80 శాతం గాల్ స్టోన్స్ కొలెస్ట్రాల్ వల్లే ఏర్పడుతాయి. ముఖ్యంగా ఇవి కొద్దిగా ఘనంగా ఏర్పడుతాయి. గాల్ బ్లాడర్ లో ఏర్పడే గాల్ స్టోన్స్ చాలా పెద్దగా లేదా చాలా చిన్నది గాను ఉంటుంది . గాల్ బ్లాడర్ లో ఒక్కసారిగా స్టోన్స్ ఏర్పడినప్పుడు, ఒక్కొసారిగా పిత్తప్రవాహాన్ని నిరోధిస్తుంది అలాంటి పరిస్థితుల్లో నొప్పి, కాలేయం లేదా క్లోమపు వాపుకు దారితీస్తుంది. గాల్ బ్లాడర్లో రాళ్ళు ఏర్పడినప్పుడు పొట్ట ఉబ్బరం, తేన్పులు, ఎసిడిటి, అరుగుదల లేకపోవ డం వంటి లక్షణాలతో ఇబ్బందిపడుతున్నారా? అయితే పిత్తాశయంలో రాళ్లు (గాల్‌స్టోన్స్) ఉండవచ్చని అనుమానించవచ్చు. ఎందుకంటే ఈ లక్షణాలు ఉదర సంబంధ వ్యాధికి సంబంధించినవి కావచ్చు. పిత్తాశ యంలో రాళ్లు ఉన్నప్పుడు కనబడే లక్షణాలు కావ చ్చు. ఉదరభాగం కుడివైపు నొప్పి, పొట్ట ఉబ్బరంగా ఉండటం, ముఖ్యంగా కొవ్వు పదార్థాలు ఆహారంలో తీసుకున్నప్పుడు, గాల్‌స్టోన్స్ ఏర్పడినప్పుడు సంభ విస్తుంది. దీనిని వైద్య పరిభాషలో 'కొలి లిథియాసిస్' అని అంటారు. గాల్ బ్లాడర్ లో స్టోన్ ఏర్పడితే, అకస్మాత్ గా నొప్పి ముఖ్యంగా పొట్ట ఉదయం కుడి వైపు, బ్యాక్ పెయిన్, వికారం లేద వాంతులు, కడుపు ఉబ్బరం, అజీర్తీ, చలి వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. =జూ్యా మీ=జు: పిత్తాశయంలో రాళ్ళను సహజంగా తొలగించడం ఎలా ? ఇలాంటి పరిస్థితిలో సరైన జీవనశైలిని మెయింటైన్ చేయకపోతే గాల్ స్టోన్ ఏర్పడే అవకాశం ఉంది. గాల్ స్టోన్ ప్రభావం వల్ల ఊబకాయం, డయాబెటిస్, లివర్ డిసీజ్, గర్భధారణ, సరైన జీవనశైలిపాటించకపోడం ఎక్కువ పాట్ ఉన్న ఆహారాలు తీసుకోవడం, అనీమియా గాల్ స్టోన్ ప్రమాధాన్ని కలిగిస్తుంది. గాల్ స్టోన్స్ నివారించే కొన్ని ఉత్తమ నేచురల్ ఫుడ్స్ ఈ క్రింది విధంగా...

**గాల్స్ స్టోన్స్ ను తొలగించే బెస్ట్ నేచురల్ ఫుడ్స్ పీయర్స్ (బేరి పండ్లు):** పీయర్స్ లో ఉండే పెక్టిన్ అనే కాంపౌడ్ గాల్ స్టోన్ కొలెస్ట్రాల్ ను పాస్ట్ చేసేందుకు సహాయపడుతుంది, కాబట్టి, ఇవి శరీరం నుండి బయటకు నెట్టివేయడానికి గ్రేట్ గా సహాయపడు తుంది. ఇంకా గాల్ స్టోన్ ద్వారా వచ్చే నొప్పిని మరియు ఇతర లక్షణాలను నివారిస్తుంది.

**ఆముదం:** గాల్ స్టోన్ నివారిస్తుంది మరియు గాల్ స్టోన్స్ ను తగ్గించడంలో సహాయపడుతుంది. ఆముదం లో యాంటీఇన్ఫ్లమేటరీ లక్షణాలు నొప్పిని తగ్గిస్తాయి. ఆముదంలో వ్యాధినిధోకతను పెంచే శోషరస వ్యవస్థ సానుకూల ప్రభావం కలిగి ఉంటుంది. కాస్ట్రాల్ ఆయిల్ తో మసాజ్ చేస్తే నొప్పి తగ్గించుకోవచ్చు.

**నిమ్మరసం:** నిమ్మరసం సిట్రస్ ఫ్రూట్ గాల్ బ్లాడర్ లో కొవ్వు చేరకుండా సహాయపడుతుంది. దాంతో గాల్ స్టోను ఏర్పడకుండా నివారిస్తుంది. లెమన్ జ్యూస్ ను రోజుకు మూడు సార్లు తీసుకోవచ్చు.

**విటమిన్ సి:** విటమిన్ సి బైల్ యాసిడ్స్, ను కొలెస్టాల్ గా మార్చేందుకు సహాయపడుతుంది. తద్వారా గాల్ స్టోన్ కరిగించబడుతుంది అందుకు మీరు విటమిన్ సి సప్లిమెంట్ లేదా విటమిన్ సి అధికంగా ఉండే ఆరెంజ్, టమోటో వంటి సిట్రస్ పండ్లను ఎక్కువగా తీసుకోవడం వల్ల గాల్ స్టోన్ నొన్పిని తగ్గించుకోవచ్చు.

**పెప్పర్మింట్ టీ:** పుదీనా ఇది బైల్ ఫ్లూను మరియు డైజెస్టివ్ జ్యూస్ ను ఉత్పత్తి చేయడంలో ఉత్తేజ పరుస్తుంది. ఇందులో ఉండే టెర్పెన్ అనే కాంపౌడ్ గాల్ స్టోన్ ను చాలా ఎఫెక్టివ్ గా కరిగిస్తుంది. మరియు ఇది కూడా పిత్తాశయ నొప్పి మరియు దుస్సంకోచాలు విశ్రాంతి కలిగించి ఉపశమనానికి సహాయపడుతుంది. ఈ ఆకులను ఉడికించి పిప్పర్ మెంట్ టీ తయారుచేయవచ్చు.

**బీట్ రూట్, పీర్, మరియు ఆపిల్ జ్యూస్:** గాల్ స్టోన్ నివారించుకోవడంలో ఒక ఎఫెక్టివ్ నేచురల్ హోం రెమెడీ. పచ్చి బీట్ రూట్ జ్యూస్, పీర్, మరియు ఆపిల్ జ్యూస్ వంటివి లివర్ ను శుభ్రపరుస్తుంది. గాల్ స్టోన్ నివారిచడానాకి ఈ మూడింటి మిశ్రమంతో జ్యూస్ చేసి త్రాగాలి.

## గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగించే.. ఉత్తమ ఇంటి చిట్కాలు

**గొం**తు నొప్పితో బాధపడుతున్నట్లైతే వెంటనే మనం ఉప్పు నీటితో మరీ గోరువెచ్చని నీటితో గార్లింగ్ చేస్తుంటాము. ఇది కేవలం సోర్ త్రోట్ (గొంత నొప్పి) నుండి ఉపశమనం కలిగించే హోం రెమెడీ ఇది ఒక్కటే అనుకుంటారు. కానీ గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగించే హోం రెమెడీస్ అనేకం ఉన్నాయి. అవి కూడా. ముఖ్యంగా ఈక్రింది లిస్ట్‌లో తెలిపిన 7 బెస్ట్ నేచురల్ సోర్ థ్రోట్ రెడీస్ ను పరిశీలించండి. ఈ హోం రెమెడీస్ చాలా సింపుల్ గా ఉంటాయి . కానీ చాలా ఎఫెక్టివ్ గా పనిచేస్తాయి.

**గొంతు నొప్పి నుండి**
**తక్షణ ఉపశమనం కలిగించే విటమిన్స్ ఫుడ్స్**

గొంతు నొప్పితో బాధపడే ఈ హోం రెమెడిస్ కంటే మరింత వేగంగా మరే ఇతర మెడిసిన్స్ పనిచేయవు. చాలా ఎఫెక్టివ్ గా వేగంగా గొంతు నొప్పిని నివారిస్తాయి కొన్ని మందులు ప్రస్తుతానికి ఉపశమనం కలిగించినా మాత్రలు నిలిపేస్తే తిరిగి పునరావృతం అవుతుంది. కానీ ఈ హోం రెమెడీస్ ద్వారా గొంతు నొప్పి మరియు ఇన్ఫెక్షన్ నుండి త్వరగా ఉపశమనం కలిగిస్తుంది.

**ఈ జ్యూసులతో జలుబు, గొంతు నొప్పి మటు మాయం**

గార్గిలింగ్ ద్వారా గొంతు నొప్పి, క్రిములను నాశనం చేయవచ్చు. మరియు గొంత నొప్పి నుండి ఉపశమనం పొందవచ్చు. మరి దీంతో పాటు మరొకొన్ని ఎఫెక్టివ్ హోం రెమెడీస్ ఈ క్రింది విధంగా...

**లెమన్ వాటర్:** హోం మేడ్ సోర్ థ్రోట్ హోం రెమెడీ. ఒక గ్లాసు నీళ్ళలో నిమ్మరసం మిక్స్ చేసి బాగా మిక్స్ చేయాలి. ఈ ఆస్ట్రిజెంట్ జ్యూస్ గొంత వాపును తగ్గి స్తుంది మరయిు వైరస్ మరియు బ్యాక్టీరియాను గొంతులో చేరకుండా నిరోధిస్తుంది . అయితే ఎక్కువ నిమ్మరసం వేయకుండా చాలా తక్కువగా మిక్స్ చేసుకోవాలి.

**టమోటో జ్యూస్:** గొంతు నొప్పి నుండి తక్షణం ఉపశమనం పొందాలనుకుంటే, దీన్ని త్రాగవచ్చు. హాట్ వాటర్ మరియు టమోటో జ్యూస్ ను సమంగా తీసుకొని త్రాగాలి. ఇందులో కొద్దిగా పెప్పర్ సాస్ మిక్స్ చేసి త్రాగవచ్చు లేదా గార్గిలింగ్ చేయవచ్చు. ఈ మిశ్రమం గొంతు నొప్పి నివారించడంలో గ్రేట్ గా సహాయపడుతుంది. **అల్లం, తేనె, మరియు లెమన్ వాటర్:** గొంతు నొప్పి నివారించడానికి ఒక ఎఫెక్టివ్ హోం రెమెడీ. ఇది అల్లం మరియు తేనెను వేడి నీటిలో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయాలి. ఈ నీటిని నోట్లో పోసుకొని గార్గిలింగ్ చేయడం వల్ల తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.

**పసుపు మరియు వాటర్:** ఇంట్లో పొడి చేసుకొన్న పసుపులో అనేక బ్యూటీ అండ్ హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. పసులో యాంటీ బ్యాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. మరియు యాంటీ యాక్సిడెంట్స్ లక్షణాలు అనేక వ్యాధులతో పోరాడే లక్షణాలు కలిగి ఉన్నాయి. కాబట్టి ఒకటీస్పూన్ పసుపు గోరువెచ్చని ఒక గ్లాసు నీళ్ళలో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయడం లేదా గోరువెచ్చగా త్రాగడం వల్ల తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. గొంతు నొప్పికి ఇది ఒక బెస్ట్ హోం రెమెడీ.

**లవంగాల టీ:** వేడి నీటిలో ఒక టీస్పూన్ లవంగాలపొడి వేసి బాగా మిక్స్ చేసి నోట్లో పోసుకుని గార్గిలింగ్ చేయాలి. లవంగాల టీలో యాంటీ బ్యాక్టీరి యల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి గొంత నొప్పి నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది.

**గ్రీన్ టీ:** బరువు తగ్గిచడంతో పాటు వ్యాధినిరో ధకతను పెంచి మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను అందించే మ్యాజికల్ టీ గ్రీన్ టీ. గోరువెచ్చని గ్రీన్ టీ గొంత నొప్పి నుండి ఉపశమనం కలిగించడంతో పాటు బ్యాక్టీరియాను నాశనం చేస్తుంది.

**హాట్ సాస్ మరియు వాటర్:** హాట్ సాస్ పేరు వింటే కొద్దిగా భయం వేస్తుంది. కానీ చాలా ఎఫెక్టివ్ గా వెంటనే ఉపశమనం కలిగిస్తుంది. తక్షణ ఉపశమనం పొందడానికి కేయాన్ పెప్పర్ సాస్ ను హాట్ వాటర్లో మిక్స్ చేసి గార్గిలింగ్ చేయడం లేదా గోరువెచ్చగా త్రాగడం వల్ల కూడా వెంటనే ఉపశమనం కలిగిస్తుంది. ఇది నొప్పిని మరియు ఇన్ఫ్లమేషన్ ను తగ్గిస్తుంది.

### శీతాకాలంలో క్యారెట్లతో చర్మ సంరక్షణ ఇలా..!



శీతాకాలంలో సహజంగానే ఎవరి చర్మం అయినా పగులుతుంటుంది. చర్మం పొడిగా మారి కొందరికి దురద కూడా వస్తుంటుంది. అయితే శీతాకాలంలో చర్మాన్ని మృదువుగా, తేమగా ఉంచుకోవాలంటే అందుకు క్యారెట్ ఎంతగానో పనిచేస్తుంది. దాంతో చర్మాన్ని ఎలా సంరక్షించుకోవచ్చో ఇప్పుడు తెలుసుకుందాం. క్యారెట్ సగం ముక్క తీసుకుని దాన్ని తురుం పట్టి మిక్సీలో వేసి పేస్ట్ చేసుకోవాలి. ఆ మిశ్రమంలో ఒక టీస్పూన్ తేనె, ఒక టీస్పూన్ పాలు వేసి బాగా కలిపి చర్మానికి రాయాలి. 15 నిమిషాల తరువాత చల్లని నీటితో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమగా మారుతుంది. పగలకుండా ఉంటుంది. దీన్ని ముఖానికి ఫేస్ ప్యాక్‌గా కూడా వేసుకోవచ్చు. ఆయిలీ స్కిన్ ఉన్నవారికి కూడా క్యారెట్లు ఎంతో మేలు చేస్తాయి. చర్మం నుంచి విడుదలయ్యే నూనెలాంటి ద్రవాన్ని క్యారెట్లలో ఉండే విటమిన్ ఎ బయటకు పంపుతుంది. దీంతో చర్మం మృదువుగా మారుతుంది. క్యారెట్ జ్యూస్ ఒక కప్పు తీసుకుని అందులో పెరుగు, శనగపిండి, నిమ్మరసంలను ఒక్కో టేబుల్ స్పూన్ చొప్పున వేసి బాగా కలిపి ఆ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు ప్యాక్‌గా వేసుకోవాలి. 30 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేస్తే ఆయిలీ స్కిన్ నుంచి విముక్తి పొందవచ్చు. క్యారెట్ జ్యూస్, పెరుగు, ఎగ్ వైట్‌లను సమపాళ్లలో కలిపి మిశ్రమంగా చేసి దాన్ని ముఖానికి రాసుకుని 15 నిమిషాలు ఆగాక గోరు వెచ్చని నీటితో కడిగేయాలి. దీంతో చర్మంపై ఉండే డెడ్ స్కిన్ సెల్స్ తొలగిపోతాయి. చర్మం తాజాగా మారుతుంది. ముఖ సౌందర్యం పెరుగుతుంది.

# తేనె చేసే మేలు



తేనె చేసే మంచి అంతా ఇంతా కాదు. అందాన్నీ, ఆరోగ్యాన్నీ పెంచడంలో తేనె కీలకపాత్ర పోషిస్తుంది. అందుకే దీనిని రకరకాలుగా ఉపయోగిస్తుంటారు. అజీర్తి, నోటి దుర్వాసన వంటి సమస్యలకు తేనె మంచి పరిష్కారం.

తేనెకు కొవ్వును కరిగించే గుణం ఉంది. ప్రతి ఉదయం ఒక గ్లాసెడు గోరువెచ్చని నీళ్లలో కాసింత తేనె కలుపుకొని తాగితే జీవక్రియలు సాఫీగా సాగుతాయి. ఒంట్లో వేడి తగ్గుతుంది.

తేనె కలిపిన నీరు తీసుకోవడం వల్ల గొంతులోని కఫం తగ్గుతుంది. జలుబు, దగ్గు ఉపశమిస్తాయి. అల్లం ముక్కను తేనెలో బాగా నానబెట్టి తింటే అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. చిన్న గ్లాసెడు నీళ్లలో అర టీస్పూన్ తేనె కలిపి పుక్కిలిస్తే నోటిలోని సూక్ష్మక్రిములు తొలగిపోతాయి. నోరు దుర్వాసన రాకుండా ఉంటుంది. అయితే.. బాగా ఎండలో తిరిగొచ్చిన తర్వాత, వ్యాయామం చేశాక తేనె తీసుకోకూడదు.

# నడుం నొప్పికి కారణాలు చికిత్సా విధానాలు

నడుం నొప్పి రెండు రకాలు..ఒకటి, అక్యుట్ లో బ్యాక్ పెయిన్ రెండు, క్రానిక్ లో బ్యాక్ పెయిన్.

క్రానిక్ బ్యాక్ పెయిన్ : నడుం నొప్పి మూడు నెలల కన్నా ఎక్కువ కాలం ఉంటే, దాన్ని 'దీర్ఘకాలిక నడుం నొప్పి' అంటారు. ప్రపంచ వ్యాప్తంగా, మనిషి వైకల్యానికి ఇది రెండో సాధారణ కారణం. ఈ సమస్య చాలామందికి వస్తుంది, వయసు పెరుగుతున్న కొద్దీ పెరుగుతుంది. వ్యక్తి జీవన విధానం మీదా, వృత్తి ఉద్యోగాల మీదా తీవ్ర ప్రభావం చూపుతుంది.

నడుం నొప్పి వివిధ కారణాలవల్ల వస్తుంది.

1. యాక్సిడెంట్స్, వెన్నుపూసకు గాయాలు, ఫ్రాక్చర్స్.
2. కండరాల స్ప్రెయిన్.
3. క్షయ వ్యాధి.
4. స్పాండిలైటిస్.
5. మానసిక ఒత్తిడి, డిప్రెషన్.
6. వెన్నుపూస ఎముకలు జారడం.

1. ప్రమాదాలతో వచ్చే నడుం నొప్పి

ప్రమాదాల్లో బలమైన దెబ్బ తగలడం వల్ల లేదా చాలా బరువైన వస్తువులను ఎత్తడం వల్ల కండరాలు దెబ్బతింటాయి. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల్లో.. వెన్నుపూస ఎముకలు విరగడం, వెన్ను మధ్యలోని జెల్ లాంటి డిస్కు బయటకు రావడం కూడా జరుగుతుంది.

2. ఇతర వ్యాధులతో వచ్చే నడుం నొప్పి

క్షయవ్యాధి : వెన్నుపూస ఎముకలకు క్షయ సోకడం, అవి చీము పట్టడం జరుగుతుంది. దానివల్ల వెన్నుపూస ఎముకలు అరగడం, దెబ్బతినడం జరుగుతుంది.



క్యాన్సర్: ఊపిరితిత్తుల క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్ వెన్నుపూసకు సోకినప్పుడు, వెన్నుపూస ఎముకలు ఫ్రాక్చర్ అవుతాయి.

3. వయసుతో వచ్చే నడుం నొప్పి: దీర్ఘకాలంగా బరువైన పనులు చేసే భవన నిర్మాణ కూలీలకు, శ్రామికులకు వెన్నుపూస, డిస్క్ అరిగే ఆస్కారం ఎక్కువ. దీనివల్ల కూడా నడుం నొప్పి వస్తుంది.

4. డిస్క్ ప్రొలాప్స్ వల్ల వచ్చే నడుం నొప్పి: నడుం నుంచి, తొడ వెనుక భాగం నుంచి.. అరికాలు పాదం వరకూ నొప్పి వస్తుంది. దీన్ని 'సయాటికా' అంటారు. డిస్క్ ప్రొలాప్స్ అరగడం, వెన్నుపూస నరాల ఒత్తిడి వల్ల జరుగుతుంది.

5. రోడ్డు ప్రమాదాలవల్ల వచ్చే నడుం నొప్పి: ఈ సమస్యతో బాధపడుతున్నవారిని విపరీతమైన నొప్పి వేధిస్తుంది. కాళ్లు కదల్చలేకపోవడం కూడా ఉంటుంది.

6. క్షయవ్యాధివల్ల వచ్చే నడుం నొప్పి: కండరాలు బాగా పట్టేసి ఉంటాయి. విపరీతమైన నొప్పి ఉంటుంది.

నిర్ధారణజి

ఎంఆర్ఐ లుంబార్ స్పైన్/ సీటీ లుంబార్ స్కాన్ చేసి వ్యాధి ఎక్కడ ఉందో, దేనివల్ల నొప్పి వస్తుందో కనుక్కోవచ్చు.

ట్రీట్‌మెంట్ : నడుం నొప్పికి చాలా కారణాలు ఉంటాయి. దాన్ని బట్టి ట్రీట్‌మెంట్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. సమస్య మూలాన్ని కనిపెట్టి, దానికి తగిన ట్రీట్‌మెంట్ ఇచ్చినట్లయితే, నొప్పిని చాలావరకూ తగ్గించవచ్చు.

కన్జర్వేటివ్ థెరపీ : మందులతో చేసే ట్రీట్‌మెంట్ ఇది.

సయాటికా : డిస్క్ పొల్రాప్స్‌లో ఇచ్చే ట్రీట్‌మెంట్.

బెడ్ రెస్ట్ : మొదట అందరికీ సాధారణంగా బెడ్‌రెస్ట్ సూచిస్తాం. దీని వల్ల రోజూ చేసే పనులకు దూరంగా ఉండటం, బరువులు ఎత్తకుండా ఉండటం వల్ల నడుం నొప్పి చాలా వరకూ తగ్గుతుంది. తర్వాత ఫిజియోథెరపీ. ఇందులో హాట్ ప్యాక్స్, అల్ట్రాసౌండ్ థెరపీ ఉంటాయి. కొంచెం నొప్పి తగ్గిన తర్వాత కండరాల నొప్పి తగ్గడానికి ఎక్సర్‌సైజ్ థెరపీని సూచిస్తాం.

సర్జికల్ ట్రీట్‌మెంట్ : వ్యాధి తీవ్రతనుబట్టి సర్జరీ చేయించుకోవాల్సి ఉంటుంది. క్షయ, క్యాన్సర్ ట్యూమర్స్, వెన్నుపూస ఎముకలు జరగడం, ఫ్రాక్చర్.. వీటికి సర్జరీతో ట్రీట్ చేస్తాం.

సైకలాజికల్ ట్రీట్‌మెంట్ : మానసిక, ఒత్తిడి, డిప్రెషన్‌వల్ల వచ్చే నడుం నొప్పికి సైకలాజికల్ కౌన్సెలింగ్ అవసరం ఉంటుంది.

# అమరజీవి త్యాగఫలమే ఆంధ్ర ప్రదేశ్ అవతరణ

## - నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి



విశాఖపట్నం నవంబర్ 1:- స్వాతంత్ర సమరయోధులు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలమే నేడు ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం అని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. బుధవారం ఆమె ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి జివిఎంసి కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మతో కలిసి పూలమాలవేసి, అంజలిని ఘటించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడే అయ్యేందుకు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధన, త్యాగఫలమే నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ పండుగ జరుపుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగర మేయర్ మాట్లాడుతూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉండేదని దేశంలో తొలి బాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ గుర్తింపు పొందిందన్నారు. బాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టి శ్రీరాములు వారి ఆశయమే నేడు ఆంధ్ర రాష్ట్ర పండుగగా ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని మనమందరం జరుపు కుంటున్నామన్నారు. తెలుగు వారి కొరకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కొరకు పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేశారని, దాని ఫలితంగా 1956 నవంబర్ 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

అనంతరం జివిఎంసి ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలతో అంజలిని ఘటించారు.

ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ అఫ్ అకౌంట్స్ వాసుదేవ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సురేష్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు, జివిఎంసి ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు అర్పించిన నగర సీపీ డాక్టర్.ఏ.రవి శంకర్, ఐ.పీ.ఎస్



విశాఖపట్నం(విజయభాను న్యూస్): ప్రత్యేక రాష్ట్రము కొరకు 56 రోజులు నిరాటంకంగా దీక్ష చేసిన మహనీయుడు అమరజీవి , ఆంధ్రరాష్ట్రం కోసం తనను తాను బలిదానం చేసుకున్న గొప్ప త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు చేసిన కృషి, దీక్ష ఫలితమే ఈ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది , భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయము. అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయం, పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించి, స్మరించుకోవడం జరిగినది.

ఈ కార్యక్రమం లో డి.సి.పి-01(ఎల్&ఓ) కే.శ్రీనివాసరావు,ఐ.పీ.ఎస్. డి.సీ.పి-02(ఎల్&ఓ) శ్రీ కే.ఆనంద రెడ్డి గారు, డి.సి.పి(క్రైమ్స్) శ్రీ జి. నాగన్న గారు, ఎ.డి.సి.పి లు, ఎ.సి.పి లు, ఏ.ఓ, డిపో సిబ్బంది, ఆర్మ్డ్ రిజర్వ్ ఎ.డి.సి.పి, ఎ.సి.పి లు, ఆర్.ఐ లూ, పి.ఆర్.ఓ ఇతర పోలీసు అధికారులూ, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ టైక్వాండో పోటీల విజేతలను అభినందించిన వై వి సుబ్బారెడ్డి

విశాఖ రురల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో అక్టోబర్ 21 ,22 తేదీలలో ఆంధ్రప్రదేశ్ ఆమెచూర్ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ ఇంటర్ స్టేట్స్ ఇన్విటేషనల్ తైక్వాండో ఛాంపియన్షిప్ 2023 పోటీలలో మధురవాడ ఆనంద్ తైక్వాండో & మార్షల్ ఆర్ట్స్ క్లబ్ కు చెందిన నలుగురు విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలను బుధవారం వైయస్సార్సీపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వై వి సుబ్బారెడ్డి అభినందించారు. బాలుర విభాగంలో ప్రథమ శ్రేణి నిలిచి, 41 కేజీల విభాగంలో ఎస్ నిఖిల్ (బంగారు పతకం ),57 కేజీల విభాగంలో పి వెంకటేష్ (బంగారు పతకం) సీనియర్స్ కేటగిరి లో అండర్ 63 కేజీస్ విభాగంలో బీ.హేమంత్ శ్రీనాథ్ (బంగారు పతకం) అలాగే బాలికల విభాగంలో ద్వితీయ శ్రేణి లో నిలిచి అండర్ 47 కేజీల విభాగంలో ఏ.పవిత్ర (రజతపతకం), అండర్ 51 కేజీల విభాగంలో పి. భార్గవి (రజతపతకం)లు సాధించారు. విజేతలకు శిక్షణ ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ టైక్వాండో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కోచ్



ఆనంద్ ను సుబ్బారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నగర అధ్యక్షులు కోల గురువులు, శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వంకాయలు మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# వాంఖడే స్టేడియంలో క్రికెట్ దేవుడి విగ్రహం..!

భారత దిగ్గజం సచిన్ టెండూల్కర్ విగ్రహాన్ని ముంబయిలోని వాంఖడే స్టేడియంలో బుధవారం ఆవిష్కరించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, బీసీసీఐ కార్యదర్శి జై, బీసీసీ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, ఎన్‌సీపీ పార్టీ అధినేత, మాజీ ఐసీసీ చీఫ్ శరద్ పవార్, ఎంసీఏ అధ్యక్షుడు అమోల్ కాలేతో పాటు సచిన్ కుటుంబీకులు హాజరయ్యారు. సచిన్ 50వ పడిలోకి ప్రవేశించిన సందర్భంగా వాంఖడే స్టేడియంలో సచిన్ టెండూల్కర్ స్టాండ్ సమీపంలో ముంబయి క్రికెట్ అసోసియేషన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్‌లో జన్మదినం సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించాలని భావించినా.. నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. కార్యక్రమానికి హాజరయ్యే ముందు స్టేడియంలో ఓ దివ్యాంగు అభిమానుడికి ఆటోగ్రాఫ్ ఇచ్చాడు. సచిన్ విగ్రహాన్ని అహ్మద్‌నగర్‌కు చెందిన ప్రమోద్ కాంబ్లే తయారు చేశారు. సచిన్ ఐకానిక్ స్ట్రోక్‌ను విగ్రహంగా మలిచారు. ఇక సచిన్ తన చివరి టెస్ట్ మ్యాచ్‌ను 2013 నవంబర్‌లో ఆడాడు. ఆ మ్యాచ్‌లో 118 బంతుల్లో 74 పరుగులు సాధించాడు. తన విగ్రహం ప్రారంభోత్సవం సందర్భంగా సచిన్ వాంఖడే స్టేడియంతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు. 1983లో వెస్టిండిస్ జట్టు భారత పర్యటనకు వచ్చిన సమయంలో స్టేడియంలోకి తొలిసారిగా బాంద్రాలోని స్నేహితులతో కలిసి స్టేడియానికి వచ్చినట్లు గుర్తు చేసుకున్నాడు. తాను నార్త్ స్టాండ్‌కు వెళ్లానని చెప్పాడు. వాంఖడే స్టేడియంలో డ్రెస్సింగ్ రూమ్ చేసేందుకు సునీల్ గవాస్కర్ ఆహ్వానించారని.. 14 ఏళ్ల పిల్లవాడికి అది చాలా పెద్దవిషయమని చెప్పుకొచ్చాడు.

# జన్మదినోత్సవ వేడుకలు దైనందిన కార్యక్రమాలతో జరుపుకోండి

**- చౌక్కాకుల అనిల్ పుట్టినరోజును పురస్కరించుకుని అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదాలు పంపిణీ**


**- ఎరిమేలి అయ్యప్ప అన్నసమారాధన సేవా ట్రస్ట్ కు ఆర్థిక సహాయం చేసిన చౌక్కాకుల లక్ష్మీ వెంకటరావు కుటుంబసభ్యులు**



అక్కయ్యపాలెం(విజయభాను న్యూస్): హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా నేటి కాలంలో యువత పుట్టినరోజులు పెళ్లి రోజులు తదితర శుభకార్యాలు దైనందిన కార్యక్రమాలతో జరుపుకోవాలని ప్రముఖ వ్యాపారవేత్త, సంఘ సేవకుడు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చౌక్కాకుల లక్ష్మీ వెంకట రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా బుధవారం వికె పిసిపిఐఆర్ యుడిఏ చైర్పర్సన్ చౌక్కాకుల లక్ష్మి వెంకటరావు కుమారుడు చౌక్కాకుల అనిల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలో ఆంధ్రజ్యోతి దినపత్రిక బిల్డింగ్ పక్కన, ఎన్ హెచ్- 5 దగ్గర ఏర్పాటు చేసిన ఎలిమేలి అయ్యప్ప అన్న సమారాధన సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మాలధారులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేశారు.ఎలిమేరి అయ్యప్ప అన్న సమారాధన నిత్య అన్నదాన ట్రస్ట్ ఏర్పాటుచేసిన నిత్యాన్నదాన్ని కార్యక్రమాన్ని సందర్శించి ట్రస్టుకు రూ,65,000 ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు



చౌక్కాకుల లక్ష్మి వెంకటరావు దంపతులకు మరియు అనిల్, సమీరా దంపతులకు సాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదములు అందజేశారు. ఈ సందర్భంగా చౌక్కాకుల లక్ష్మి వెంకట రావు మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహించినటువంటి ట్రస్టు సభ్యులందరికీ అయ్యప్ప స్వామి దయవుండాలని మరియు వాళ్ళ కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యాలతో ఉండాలని అయ్యప్ప స్వామిని దీవెనలు ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్టు సభ్యులను చౌక్కాకుల దంపతులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్కేన జగన్, సురేష్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



# రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం చిరస్మరణీయం

## - ఉత్తర వైకాపా కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



సీతమ్మధార(విజయభాను న్యూస్): తెలుగు వారందరికీ ప్రత్యేక రాష్ట్ర అవతరణ సాధన కోసం తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని నెడ్ క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు కె.అనిల్ కుమార్ రాజు,సాడి పద్మారెడ్డి,సారిపల్లి గోవింద్, ఆళ్ళ లీలావతి, శ్రీనివాసరావు,వావిలపల్లి ప్రసాద్,కె.వి.యన్ శశికళ,కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు,రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత,జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆళ్ల శివ గణేష్,మండల ఇంచార్జ్ లు కృష్ణారావు మాస్టర్,బులుసు జగదీశ్,అమర్ రెడ్డి,వసంత అప్పారావు, డైరెక్టర్లు రాయుడు శ్రీనివాస్,వెంకటలక్ష్మీ & రత్నాకర్, సీనియర్ నాయ కులు బోగవల్లి గోవింద్, యం.సునీల్,కె.చిన్న,కోడూరి సుశీల, మహదాస్య గోపి,కె.సత్యనారాయణ, జక్కంపూడి సత్యనారాయణ, రాజ్ కుమారి, రామిరెడ్డి,రాఘవులు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# స్కేట్ బోర్డింగ్ లో బంగారం అబిషా కళ

విశాఖ రురల్ : మధురవాడ (విజయభాను న్యూస్) : కృషి పట్టుదల ఉంటె ఏదైనా సాధించగలమని మధురవాడ స్వతంత్రనగర్ కు చెందిన విద్యార్థిని అబిషా కళ నిరూపించింది. విశాఖపట్నం డిస్టిక్ రోలర్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కేట్ బోర్డింగ్ పోటీలలో మహా విశాఖ ఎస్. ఎఫ్.ఎస్.స్కూల్ లో చదువుతున్న బి. అబిషా కళ అండర్-17 కేటగిరీ విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి బంగార పతాకం సాధించింది. సుమారు 60 మంది క్రీడాకారులపై తన ప్రతిభను కనబరిచి ఈఘనత సాధించి జాయింట్ కమిషనర్ వి.ఎం.ఆర్.డి.ఎ. వి.రవీంద్ర చేతుల మీదుగా అవార్డును అందుకుంది. గతంలోను ప్రతిభ కనబరిచి స్కేట్ బోర్డింగ్ లో మెడల్స్ గెలుపొందారు. సుమారు 2సంవత్సరాల కష్టం కృషికి ఫలితం దక్కిందని ఈ విజయంపై తల్లిదండ్రులు బి.ఏం.వి.ప్రసాద్ బాబు, శిల్పా దంపతులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో కూడా ప్రతిభ చూపాలని గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 * Phone : 2564353, Fax : 0891-2569004 * e-mail: vijayabhanudaily@gmail.com